thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

భారత్ ఖాతాలో 54 పతకాలు!



11

చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 191 | జగిత్యాల గురువారం 22 అక్టోబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |



'పురుషాధిక్య వర్గం'గా ఆర్ఎస్ఎస్

మహిళలను పురుషుల ఆస్తిగా చూసే ఆర్ఎస్ఎస్‌తో నా పోరాటం ఆగదు!

- నేను శివశక్తిని నమ్ముతా.. ఆర్ఎస్ఎస్‌తో పోరాడటం ఆనందం: రాహుల్ గాంధీ

"ఆర్ఎస్ఎస్ అనేది కేవలం పురుషులతో కూడిన, రాజ్యాంగ వ్యతిరేక సంస్థ. మహిళలు పురుషుల ఆస్తి అని అది నమ్ముతుంది," అని రాహుల్ గాంధీ 'ఎక్స్' ప్లాట్‌ఫామ్‌లో పోస్ట్ చేశారు. ఆర్ఎస్ఎస్‌తో పోరాడటం తనకు ఆనందాన్నిస్తుందని చెప్పారు.

.. వివరాలు 4లో


సమాజాన్ని చీల్చేవారే దేశ శత్రువులు

భారతీయ సంస్కృతిని ద్వేషించే శక్తులపై ఐక్యంగా పోరాడాలి

- 'దేశమే ప్రథమం' అనే సంకల్పంతో ముందుకు సాగాలి
- ఢిల్లీ రావణ దహన వేడుకల్లో ప్రధాని మోదీ పిలుపు

సమాజంలో విభేదాలు సృష్టించే వ్యక్తులు, దేశ గౌరవాన్ని దెబ్బతీసే శక్తులు, భారతీయ సంస్కృతిని ద్వేషించే మనస్తత్వం ఉన్నవారిని దేశ శత్రువులుగా గుర్తించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. అలాంటి శక్తులను దీటుగా ఎదుర్కొనేందుకు ప్రజలంతా ఐక్యంగా నిలవాలని, 'దేశమే ప్రథమం' అనే సంకల్పంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు.

3





ప్రపంచానికి తెలంగాణ వైభవం

03

- డిసెంబర్ 7 నుంచి 'ఇన్వెస్ట్ తెలంగాణ' సమ్మిట్
- సంప్రదాయ కళారూపాలు, ఎయిర్ షో ఏర్పాటు
- ప్రధాన నగరాల్లో ప్రచారానికి సీఎస్ ఆదేశం
- ఈ నెల 24న హైదరాబాద్‌లో కర్టెన్ రైజర్

మీరు ఒంటరి కాదు.. మేమున్నాం!

గోషామహల్ పోలీసు స్మారక పరేడ్‌లో అమరులకు సీఎం ఘన నివాళి

అమరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా

- కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ వరకు ఎక్స్‌గ్రేషియాను తమ ప్రభుత్వమే కోటికి పెంచిందని వెల్లడి
- హోంగార్డుల పరిహారం సైతం రూ.10 లక్షలకు పెంచాలని తాజాగా డీజీపీకి ఆదేశాలు
- 2028 నాటికి పోలీస్ శాఖలో అన్ని ఖాళీల భర్తీకి ముఖ్యమంత్రి హామీ



సమాజం కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం గోషామహల్ స్టేడియంలో జరిగిన స్మారక పరేడ్‌లో డీజీపీ సీవీ ఆనంద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు.

వివరాలు 2లో..



ఎస్‌బీఐపై సైబర్ ఎటాక్!

3,897 మంది ఖాతాదారుల డేటా లీక్


.. వివరాలు 3లో



షరతులతో సీజేపీ నేతలకు బెయిల్!

- తీహార్ జైలు నుంచి ఇద్దరి విడుదల..

.. వివరాలు 2లో



భారత్‌లో జోక్యం చేసుకోం!

యూఎన్ వ్యాఖ్యలపై రూబియో స్పందన

.. వివరాలు 3లో



19 రోజుల్లో 2 వేల కోట్లు!

- రాష్ట్రంలో భారీగా మద్యం విక్రయాలు
- గతేడాదితో పోలిస్తే 37 శాతం వృద్ధి

3

మైసూరు దసరాలో సీఎం రేవంత్!

జంబూ సవారిని వీక్షించిన ముఖ్యమంత్రి

బంగారు అంబారీలో చాముండేశ్వరి దర్శనం

2



మంత్రి కాన్వాయ్ అడ్డగింత!



- జైపూర్ మండలం కుందారంలో ఉద్రిక్తత
- సాగునీరు, కరెంట్ కోసం రైతుల ఆందోళన
- మంత్రి వివేక్ కాన్వాయ్ అడ్డుకున్న అన్నదాతలు

3

చెన్నూరు నియోజకవర్గం జైపూర్ మండలం కుందారం గ్రామంలో సోమవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. సాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కాన్వాయ్‌ను స్థానిక రైతులు అడ్డుకున్నారు.



క్షేత్రస్థాయికి వచ్చి మాట్లాడండి!

2

ప్రాజెక్టులను వదిలేసిన బీఆర్ఎస్ నేతలు నీళ్లడుగుతారా?

కేటీఆర్, నిరంజన్ రెడ్డిలకు మంత్రి జూపల్లి కౌంటర్

జూపల్లి సవాల్‌కు నేను సిద్ధం!

- ప్రాజెక్టులపై చర్చకు రావాలి
- మంత్రికి నిరంజన్ రెడ్డి కౌంటర్
- ఆ పనులన్నీ కేసీఆర్ హయాంలోనివే

2





వకుళాభరణం రచనా కృషికి ప్రశంస!

గవర్నర్‌ను కలిసిన బీసీ కమిషన్ మాజీ చైర్మన్

తాను రచించిన పుస్తకాల అందజేత

3



మైసూరు దసరాలో సీఎం రేవంత్!

జంబూ సవారిని వీక్షించిన ముఖ్యమంత్రి

బంగారు అంబారీలో చాముండేశ్వరి దర్శనం

డీకే శివకుమార్ ఆహ్వానంతో వేడుకలకు హాజరు

రాష్ట్ర ప్రజల కోసం అమ్మవారికి ప్రత్యేక పూజలు

మైసూరు : కర్ణాటకలో అత్యంత వైభవంగా జరిగే చారిత్రక మైసూరు దసరా ఉత్సవాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. డీకే శివకుమార్ ఆహ్వానం మేరకు ఆయన ఈ వేడుకలకు హాజరయ్యారు. ఉత్సవాల్లో అత్యంత కీలక ఘట్టమైన 'జంబూ సవారి'ని సీఎం వీక్షించారు. అందంగా అలంకరించిన ఏనుగుపై బంగారు అంబారీలో కొలువుదీరిన చాముండేశ్వరి అమ్మవారి ఉత్సవమూర్తిని దర్శించుకున్నారు. ఈ వేడుకల్లో పాల్గొనడానికి ముందు రాజభవనం వద్ద ఉన్న చాముండేశ్వరి ఆలయానికి వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, అందరికీ మంచి జరగాలని ప్రార్థించారు. ఈ జంబూ సవారి ఊరేగింపులో కన్నడ సంస్కృతి, చారిత్రక వారసత్వం ఉట్టిపడేలా జానపద కళాకారులు, నృత్య బృందాల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కేరళ నేత వీడీ సతీశన్ సహా పలువురు దేశ, విదేశీ ప్రముఖులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఈ ఉత్సవాలను వీక్షించారు.



క్షేత్రస్థాయికి వచ్చి మాట్లాడండి!

ప్రాజెక్టులను వదిలేసిన బీఆర్ఎస్ నేతలు నీళ్లడుగుతారా?

కేటీఆర్, నిరంజన్ రెడ్డిలకు మంత్రి జూపల్లి కౌంటర్

నార్లాపూర్ నుంచి ఎల్లూరుకు వెయ్యి క్యూసెక్కుల నీరు

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 21 : తమ పాలనలో సాగునీటి ప్రాజెక్టులను అసంపూర్తిగా వదిలేసిన బీఆర్ఎస్ నాయకులు.. ఇప్పుడు వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. కేటీఆర్, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తదితర విపక్ష నేతలు ఏవైనా మాట్లాడే ముందు ప్రాజెక్టుల వద్దకు వచ్చి వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు. బుధవారం ఆయన నార్లాపూర్ జలాశయం నుంచి ఎల్లూరు జలాశయంలోకి వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నార్లాపూర్, ఏదుల మధ్య కాలువ తవ్వకాలు, సొరంగం పనులు ఇంకా కొనసాగుతున్నాయన్నారు. ఆ పనులు పూర్తికాకుండానే పూర్తి సామర్థ్యంతో నీటిని విడుదల చేస్తే కాలువలకు నష్టం వాటిల్లుతుందన్న కనీస అవగాహన విపక్షాలకు లేకపోవడం శోచనీయమన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా నీటి విడుదలను కోరడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని మండిపడ్డారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ప్యాకేజీ-3 పనులు ఆలస్యమయ్యాయని, మిగిలిన పనులు పూర్తి చేయడానికి మరో మూడు నెలల సమయం పడుతుందన్నారు. కాగా, తాజా నీటి విడుదలతో కల్వకుర్తి, అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, వనపర్తి నియోజకవర్గాల్లో అదనంగా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని మంత్రి వివరించారు.

జూపల్లి సవాల్‌కు నేను సిద్ధం!

ప్రాజెక్టులపై చర్చకు రావాలి

మంత్రికి నిరంజన్ రెడ్డి కౌంటర్

ఆ పనులన్నీ కేసీఆర్ హయాంలోనివే



హైదరాబాద్, అక్టోబర్ 21 : పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు విసిరిన సవాల్‌ను స్వీకరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. నార్లాపూర్ నుంచి ఎల్లూరు రిజర్వాయర్‌కు నీటిని తరలించే నిర్ణయంతో పాటు, ప్రస్తుతం మంత్రి ప్రారంభించిన తూము నిర్మాణం కూడా కేసీఆర్ హయాంలోనే జరిగాయని ఆయన గుర్తుచేశారు. శ్రీశైలం ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నందున ప్యాకేజీ-3లో అడ్డంకిగా ఉన్న మట్టిని తొలగించి వెంటనే నీటిని పంపింగ్ చేయాలని ప్రభుత్వానికి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే పాలమూరు-రంగారెడ్డి పనులు నిలిచిపోయాయని నిరంజన్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన కాలువల నిర్మాణ టెండర్లను ఎందుకు రద్దు చేశారో, తిరిగి ఎందుకు పిలవలేదో జూపల్లి సమాధానం చెప్పాలని నిలదీశారు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించిన వారిని సలహాదారులుగా నియమించుకోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మంత్రి జూపల్లికి వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలపై ఉన్న శ్రద్ధ పాలమూరు రైతులపై లేదని విమర్శించారు. తక్షణమే నిధులు విడుదల చేసి ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

మీరు ఒంటరి కాదు.. మేమున్నాం!

- **గోషామహల్ పోలీసు స్మారక పరేడ్‌లో అమరులకు సీఎం ఘన నివాళి**

హైదరాబాద్, అక్టోబర్ 21 : సమాజం కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం గోషామహల్ స్టేడియంలో జరిగిన స్మారక పరేడ్‌లో డీజీపీ సీవీ ఆనంద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. అమరులకు ఘనంగా నివాళులర్పించి, గౌరవ వందనం స్వీకరించారు. ఈ ఏడాది 155 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్న సీఎం.. ఈ సందర్భంగా పోలీసుల సంక్షేమం, అమరుల కుటుంబాలకు తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. అమరుల కుటుంబాలకు గతంలో ఉన్న ఎక్స్‌గ్రేషియాను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భారీగా పెంచిన విషయాన్ని సీఎం రేవంత్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. విధి నిర్వహణలో వీరమరణం పొందిన కానిస్టేబుల్ కుటుంబానికి గతంలో రూ.40 లక్షలు పరిహారం ఉంటే దానిని ఏకంగా రూ.కోటికి పెంచామని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్, ఏఎస్ఐలకు ఉన్న రూ.45 లక్షల పరిహారాన్ని కూడా రూ.కోటికి, ఎస్ఐలకు రూ.45 లక్షలు, ఇన్‌స్పెక్టర్లకు రూ.50 లక్షలుగా ఉన్న ఎక్స్‌గ్రేషియాను రూ.1.25 కోట్లకు పెంచామని వివరించారు. డీఎస్పీ, అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారులకు రూ.1.50 కోట్లకు.. ఎస్పీ, ఐపీఎస్ అధికారులకు రూ.2 కోట్లకు ఎక్స్‌గ్రేషియా పెంచామని సీఎం వెల్లడించారు. ఇది కేవలం ఆర్థిక సాయం కాదని, అమరుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవమని స్పష్టం చేశారు. అలాగే హోంగార్డుల పరిహారాన్ని సైతం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని అక్కడికక్కడే డీజీపీని ఆదేశించారు.

2028 నాటికి ఖాళీలన్నీ భర్తీ..

రాష్ట్ర అభివృద్ధికి శాంతిభద్రతల పరిరక్షణే కీలకమని, అందుకే పోలీస్ శాఖకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని సీఎం తెలిపారు. 2028 నాటికి పోలీస్ శాఖలో ఉన్న అన్ని ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి 112 మంది డీఎస్పీలను నియమించామని, ట్రాన్స్‌జెండర్లకు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా అవకాశం కల్పించి వారి ఆత్మగౌరవాన్ని పెంచామని గుర్తుచేశారు. పోలీసు పిల్లల చదువుల కోసం 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్'ను ప్రారంభించామని, ఇందులో హోంగార్డు నుంచి డీజీపీ స్థాయి వరకు అందరి పిల్లలకూ అవకాశం కల్పించామన్నారు.

కొత్త సవాళ్లు.. ఉక్కుపాదం!

కాలంతో పాటు నేరాల స్వభావం మారుతోందని, కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీస్ శాఖను ఆధునీకరిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. సాంకేతికత ఎంత పెరిగినా పోలీసుల్లో మానవీయ దృక్పథం మారకూడదన్నారు. డ్రగ్స్, గంజాయి లాంటి మహమ్మారుల బారిన యువత పడకుండా నిరోధించడంలో 'ఈగల్ ఫోర్స్' పనితీరు అద్భుతమని, ఈ సందర్భంగా డీజీపీని ఆయన అభినందించారు. కల్తీ ఆహారంపై ఉక్కుపాదం మోపేందుకు 'టీజీ సేఫ్' తీసుకొచ్చామన్నారు. మహిళల భద్రత కోసం మార్చిలో 'స్టాండ్ విత్ హర్', ఏప్రిల్‌లో 'స్పందన' తక్షణ రక్షణ బృందాలను ప్రారంభించామని, మహిళలు, చిన్నారుల కేసుల్లో పోలీసులు మరింత సున్నితంగా వ్యవహరించి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని సూచించారు.



మీకు మేమున్నాం..

"మీరు కోల్పోయిన వ్యక్తిని ఎవరూ తిరిగి తీసుకురాలేరు.. మీ కుటుంబాల్లో ఏర్పడిన లోటును ఎవరూ భర్తీ చేయలేరు. కానీ మీ బాధలో మీరు ఒంటరి కాదు.. తెలంగాణ సమాజం, పోలీస్ శాఖ, ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది" అని అమరుల కుటుంబాలకు సీఎం ధైర్యం చెప్పారు. అదే సమయంలో పోలీసు సిబ్బందికి దిశానిర్దేశం చేస్తూ.. "మీ క్రమశిక్షణే మీ బలం.. నిజాయతీయే మీ గౌరవం.. ప్రజలకు మీరిచ్చే భరోసాయే మీకు లభించే గొప్ప గుర్తింపు. మీరు ప్రజల భద్రతకు అండగా నిలవండి.. మీ కుటుంబాల భవిష్యత్తుకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుంది. అమరుల ఆశయాలను కొనసాగిస్తూ సురక్షిత తెలంగాణను నిర్మించుకుందాం" అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

అమరుల త్యాగాలు చిరస్మరణీయం!

- **విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసులకు డీజీపీ నివాళి**
- **గోషామహల్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం**
- **ఈ ఏడాది దేశవ్యాప్తంగా 154 మంది.. రాష్ట్రంలో ముగ్గురు అమరులు**
- **పోలీసు పిల్లల నాణ్యమైన విద్య కోసమే 'వైఐపీఎస్' స్కూల్**



హైదరాబాద్, అక్టోబర్ 21 : ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ కొనియాడారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. తీవ్రవాదం, నక్సలిజం, ఇతర అసాంఘిక శక్తులను ఎదుర్కొనే క్రమంలో వందలాది మంది పోలీసులు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 154 మంది పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోగా.. అందులో తెలంగాణకు చెందిన ఏఎస్ఐ దేవ్‌సింగ్, కానిస్టేబుళ్లు ఎంపల్లి ప్రమోద్‌కుమార్, శీలం కరుణాకర్ ఉన్నారని తెలిపారు. అమరవీరుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాతో పాటు ఇతర ప్రయోజనాలు సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పోలీసు పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకే ముఖ్యమంత్రి యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపీఎస్)ను ప్రారంభించారని, మంచిరేవులలో ఏప్రిల్ నాటికి శాశ్వత క్యాంపస్ పూర్తయితే 720 మందికి విద్య అందుతుందని వివరించారు.

కొత్త సవాళ్లకు సిద్ధంగా ఉండాలి..

మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, ఆహార కల్తీ, రోడ్డు ప్రమాదాలు ప్రస్తుతం పోలీసులకు కొత్త సవాళ్లుగా మారుతున్నాయని డీజీపీ అన్నారు. వీటిని ఎదుర్కొనేందుకు సిబ్బంది నిరంతరం నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఆధునిక నేరాల నియంత్రణతో పాటు విజిబుల్ పోలీసింగ్‌ను కొనసాగించాలన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో, డ్రగ్స్ నిర్మూలనకు ఈగల్ ఫోర్స్, ట్రాఫిక్ కోసం టీ-మార్స్ ద్వారా పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తెలంగాణ జనాభాలో కేవలం 0.3 శాతం మందికి మాత్రమే పోలీసు యూనిఫాం ధరించి ప్రజలకు సేవ చేసే అదృష్టం దక్కుతుందని, చట్టాన్ని సమర్థంగా అమలు చేస్తూ ప్రజలకు నిబద్ధతతో సేవలందించడమే అమరవీరులకు అర్పించే నిజమైన నివాళి అని డీజీపీ స్పష్టం చేశారు.



షరతులతో సీజేపీ నేతలకు బెయిల్!

తీహార్ జైలు నుంచి ఇద్దరి విడుదల..

రూ.50 వేల పూచీకత్తుతో మంజూరు

ప్రశాంతతను కాపాడతామని కోర్టుకు హామీ

ప్రతి విచారణకు హాజరుకావాలని ఆదేశం

న్యూఢిల్లీ, అక్టోబర్ 21 : జంతర్ మంతర్ వద్ద అనుమతి లేకుండా నిరసన తెలిపిన కేసులో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలకు ఢిల్లీలోని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ (ఎస్ఈఎం) కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అక్టోబరు 13వ తేదీన నిరసనలపై ఆంక్షలు అమల్లో ఉన్నప్పటికీ.. వారు ఆందోళన నిర్వహించడంతో ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత వారిని కోర్టులో హాజరుపరచగా జ్యుడీషియల్ కస్టడీ విధించింది. దీంతో వారు వారం రోజుల పాటు తీహార్ జైలులో రిమాండ్ అనుభవించి తాజాగా బెయిల్ పై విడుదలయ్యారు. న్యాయస్థానం సీజేపీ నేతల బెయిల్‌కు పలు కఠిన నిబంధనలు విధించింది. సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలు ఒక్కొక్కరు రూ.50 వేల వ్యక్తిగత పూచీకత్తుతో పాటు ఇద్దరు పూచీదారులను కోర్టుకు సమర్పించారు. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలకు పాల్పడబోమని, ప్రశాంత వాతావరణాన్ని కాపాడుతామని వారు కోర్టుకు లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారు. జంతర్ మంతర్ వద్ద ఇకపై నిరసనలకు పిలుపునివ్వబోమని, ఆ ప్రాంతాన్ని అధికారికంగా మళ్లీ నిరసన స్థలంగా ప్రకటించే వరకు అక్కడ ఎలాంటి ఆందోళనల కోసం ప్రజలను సమీకరించబోమని స్పష్టం చేశారు. అలాగే తాము భవిష్యత్తులో నిర్వహించే నిరసనలు, ప్రదర్శనలు అన్నీ రాజ్యాంగ పరిధికి లోబడే ఉంటాయని న్యాయస్థానానికి సీజేపీ నేతలు హామీ ఇచ్చారు. ఈ కేసుకు సంబంధించిన ప్రతి విచారణ తేదీన ఇద్దరూ విధిగా న్యాయస్థానానికి హాజరుకావాలని, ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడవద్దని కోర్టు వారిని ఆదేశించింది.

నీటి ఎద్దడిపై సర్కార్ అలర్ట్!

- **రామప్ప చెరువును పరిశీలించిన మంత్రి సీతక్క**
- **గోదావరి నుంచి పంపింగ్‌కు కసరత్తు**
- **ప్రకృతి వైపరీత్యాలపై రాజకీయం తగదు**
- **ఉపాధి హామీతో నీటి సంరక్షణ పనులు**

ములుగు, అక్టోబర్ 21 : ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో గత ఆరు నెలలుగా ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ నీటి సంరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధిలోని రామప్ప చెరువుతో పాటు అక్కడి డీఫ్లోరైడేషన్ ప్రాజెక్టును మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. రామప్ప చెరువులో ప్రస్తుతం 29 అడుగుల మేర నీరు అందుబాటులో ఉందన్నారు. గోదావరి నుంచి నీటిని పంపింగ్ చేసి చెరువులు, పరిసర ప్రాంతాలకు నీటి సరఫరాను మరింత మెరుగుపరిచే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. నీటి నిల్వలు పెరిగేందుకు ఏటా ఇచ్చే విరామాన్ని పరిగణనలోకి తీసుకుని, మరో రెండు రోజుల్లో నీటిని విడుదల చేసేలా చూడాలని సంబంధిత అధికారులను కోరినట్లు చెప్పారు. రామప్ప నుంచి నీటిని డీఫ్లోరైడేషన్ ప్రాజెక్టు ద్వారా శుద్ధి చేసి ములుగు, వెంకటాపురం, గోవిందరావుపేట, మల్లంపల్లి పరిసర ప్రాంతాలతో పాటు భూపాలపల్లి జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. నీటి సరఫరా వ్యవస్థలు, చెరువులపై ఆధారపడిన గ్రామాలు, భూగర్భ జలాల పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

ప్రకృతి వైపరీత్యాలపై రాజకీయం తగదు..

అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి పరిణామాలను ఏ శక్తీ పూర్తిగా నియంత్రించలేదని, ఇలాంటి సంక్షోభ పరిస్థితులను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని మంత్రి సీతక్క హితవు పలికారు. పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఉష్ణోగ్రతల్లో వస్తున్న మార్పులు వాతావరణ పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని గుర్తుచేశారు. ప్రకృతి విసిరే సవాళ్లను ఎదుర్కొనేందుకు రాజకీయ విమర్శలు పక్కనపెట్టి సమష్టి కార్యాచరణతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు.

ఉపాధి హామీతో నీటి సంరక్షణ..

వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంతలు, ఊటకుంటలు, నీటి కుంటలు, చెక్‌డ్యామ్‌లు, చెరువుల పునరుద్ధరణతో పాటు బోర్ల రీచార్జ్ పనులకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి తెలిపారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద విస్తృతంగా నీటి సంరక్షణ పనులు చేపట్టాలని సూచించారు. కూలీల సంఖ్యను పెంచి అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచులు, గ్రామస్తులకు పిలుపునిచ్చారు. ఇప్పటి నుంచే నీటి నిల్వలను పెంచుకోగలిగితే భవిష్యత్తులో నీటి ఎద్దడి తీవ్రతను అరికట్టవచ్చని చెప్పారు.

సాగునీటి అవసరాలతో పాటు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని సీతక్క స్పష్టం చేశారు. ప్రతి నీటి చుక్కను జాగ్రత్తగా వినియోగించుకోవాలని, వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. రామప్ప-లక్నవరం కాలువ వంటి ప్రతిపాదిత ప్రాజెక్టులతో పాటు ఇతర ప్రత్యామ్నాయ నీటి వనరులను అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా తాగునీటి సరఫరాను ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తుందని, నీటి సంరక్షణ చర్యల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

ప్రపంచానికి తెలంగాణ వైభవం!

- డిసెంబర్ 7 నుంచి 'ఇన్వెస్ట్ తెలంగాణ' సమ్మిట్
- సంప్రదాయ కళారూపాలు, ఎయిర్ షో ఏర్పాటు
- ప్రధాన నగరాల్లో ప్రచారానికి సీఎస్ ఆదేశం
- ఈ నెల 24న హైదరాబాద్‌లో కర్టెన్ రైజర్



హైదరాబాద్, అక్టోబర్ 21 : రాష్ట్ర సాంస్కృతిక, కళా వారసత్వాన్ని అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పేలా 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'ను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరగనున్న ఈ సదస్సు ఏర్పాట్లపై బుధవారం ఆయన ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమ్మిట్ ద్వారా పెట్టుబడుల అవకాశాలతో పాటు రాష్ట్ర చారిత్రక వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలన్నారు. సమ్మిట్ ప్రారంభంలో అతిథులకు తెలంగాణ సంప్రదాయ కళారూపాలతో స్వాగతం పలకాలని సీఎస్ సూచించారు. సదస్సులో భాగంగా డిసెంబర్ 7 నుంచి 9 వరకు రక్షా ఎక్స్‌పో కొనసాగుతుందని, చివరి రోజైన 9వ తేదీన నిర్వహించే ఎయిర్ షోను తిలకించేందుకు ప్రజలు భారీగా వచ్చే అవకాశం ఉండటంతో ప్రత్యేక కల్చరల్ కార్నివాల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఎయిర్‌పోర్టుల్లో భారీ హోర్డింగులు..

సమ్మిట్‌కు సంబంధించి ఈ నెల 24న హైదరాబాద్‌లో, 29న దిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని సీఎస్ తెలిపారు. ప్రచారం కోసం దిల్లీ, ముంబై, బెంగళూరు, శంషాబాద్ విమానాశ్రయాలతో పాటు ప్రముఖ ప్రాంతాలు, హోటళ్ల వద్ద ఆకర్షణీయమైన హోర్డింగులు ఏర్పాటు చేయాలన్నారు. సినీ ప్రముఖుల భాగస్వామ్యంతో ప్రత్యేక షార్ట్ ఫిల్మ్‌లు రూపొందించి సోషల్ మీడియా, మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, కార్యదర్శులు హరిచందన, శశాంక, ముకుంద్ రెడ్డి, అజిత్ రెడ్డి, సీఎంఓ సీపీఆర్‌వో మల్సూర్, డిజిటల్ విభాగం డైరెక్టర్ కర్రీ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

19 రోజుల్లో 2 వేల కోట్లు!

- రాష్ట్రంలో భారీగా మద్యం విక్రయాలు
- గతేడాదితో పోలిస్తే 37 శాతం వృద్ధి
- ఒక్కరోజే రూ.303 కోట్ల వ్యాపారం
- 30 లక్షల కేసులకు పైగా అమ్ముడైన బీర్లు

హైదరాబాద్, అక్టోబర్ 22 : దసరా పండుగ సీజన్ రాష్ట్రంలో మద్యం వ్యాపారానికి భారీ ఊతమిచ్చింది. పండుగ వేళ మందుబాబుల కొనుగోళ్లతో ఎక్సైజ్ శాఖకు కాసుల వర్షం కురిసింది. అక్టోబర్ మొదటి 19 రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా రూ.2,054.51 కోట్ల విలువైన మద్యం విక్రయాలు నమోదైనట్లు ఎక్సైజ్ శాఖ అధికారిక గణాంకాలు వెల్లడించాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే అమ్మకాల విలువలో 37.02 శాతం వృద్ధి నమోదు కావడం గమనార్హం. ఈ నెల ప్రారంభంలో అమ్మకాలు కొంత నెమ్మదిగా సాగినప్పటికీ.. రెండో వారం నుంచి విక్రయాలు ఊపందుకున్నాయి. ఈ నెల 16వ తేదీ నాటికి రూ.1,527.85 కోట్లుగా ఉన్న మొత్తం అమ్మకాలు.. 19వ తేదీ నాటికి ఏకంగా రూ.2 వేల కోట్లను దాటేశాయి.

బీర్లు, ఐఎంఎఫ్ఎల్ రికార్డ్ సేల్స్..

ఈ దసరా సీజన్‌లో బీర్ల వాటా ప్రత్యేకంగా కనిపించింది. అక్టోబర్ 1 నుంచి 19వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 30.37 లక్షల కేసుల బీర్లు అమ్ముడయ్యాయి. గత ఏడాది ఇదే కాలంలో అమ్ముడైన 21.55 లక్షల కేసులతో పోలిస్తే ఇది 40.9 శాతం (8.82 లక్షల కేసులు అదనం) ఎక్కువ. అలాగే ఐఎంఎఫ్ఎల్ (హార్డ్ లిక్కర్) విక్రయాలు సైతం గత ఏడాది 14.16 లక్షల కేసుల నుంచి ఈసారి 18.38 లక్షల కేసులకు చేరి 29.80 శాతం మేర వృద్ధి సాధించాయి.

ఒక్కరోజే రూ.303 కోట్లు..

దసరా సీజన్‌లో రోజువారీ విక్రయాలు కూడా గణనీయంగా పెరిగాయి. ఈ నెల 19న ఒక్కరోజే రాష్ట్రంలో



రూ.303.40 కోట్ల విలువైన మద్యం అమ్ముడుపోయింది. గత ఏడాది ఇదే రోజుతో పోలిస్తే అమ్మకాల విలువలో ఏకంగా 801.90 శాతం వృద్ధి నమోదైనట్లు ఎక్సైజ్ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పండుగ సందర్భంగా రాష్ట్ర ఖజానాకు భారీగా ఆదాయం సమకూరింది.

మంత్రి కాన్వాయ్ అడ్డగింత!



- జైపూర్ మండలం కుందారంలో ఉద్రిక్తత
- సాగునీరు, కరెంట్ కోసం రైతుల ఆందోళన
- మంత్రి వివేక్ కాన్వాయ్ అడ్డుకున్న అన్నదాతలు
- కారు దిగకుండానే వెళ్లిపోయారని రైతుల ఆగ్రహం

జైపూర్, అక్టోబర్ 21 : చెన్నూరు నియోజకవర్గం జైపూర్ మండలం కుందారం గ్రామంలో సోమవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. సాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కాన్వాయ్‌ను స్థానిక రైతులు అడ్డుకున్నారు. తమ గోడును మంత్రికి చెప్పుకునేందుకు ప్రయత్నించిన అన్నదాతలపై ఆయన అనుచరులు ఎదురుదాడికి దిగినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కనీసం కారు దిగి తమతో మాట్లాడకుండా, సమస్యల పరిష్కారంపై ఎలాంటి భరోసా ఇవ్వకుండానే మంత్రి అక్కడి నుంచి వెళ్లిపోవడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆందోళన చేస్తున్న రైతులను పోలీసులు సైతం బెదిరించారని వారు ఆరోపిస్తున్నారు. పంటలకు సాగునీరు, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ ఇవ్వాలన్న కనీస అవసరాలను అడుగుతుంటే.. ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకోకపోవడం దారుణమని రైతులు మండిపడుతున్నారు. వెంటనే తమ సమస్యలు పరిష్కరించి కుందారం రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎస్‌బీఐపై సైబర్ ఎటాక్!

3,897 మంది ఖాతాదారుల డేటా లీక్

డార్క్‌వెబ్‌లో కస్టమర్ల వ్యక్తిగత వివరాలు

కోర్ బ్యాంకింగ్ సేవలు సురక్షితమేనన్న బ్యాంకు

రంగంలోకి ఇండిపెండెంట్ సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ

ముంబై, అక్టోబర్ 21 : దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సైబర్ దాడికి గురైంది. హ్యాకర్ల దాడి కారణంగా 3,897 మంది వినియోగదారుల వ్యక్తిగత డేటా లీకై డార్క్‌వెబ్‌లోకి వెళ్లినట్లు ఎస్‌బీఐ అధికారికంగా ప్రకటించింది. ఈ డేటాలో కస్టమర్ల పేర్లు, మొబైల్ నంబర్లు, పుట్టిన తేదీ, నివాస చిరునామాలు, ఈమెయిల్ ఐడీలతో పాటు లోన్ అప్లికేషన్‌ల సమాచారం ఉన్నట్లు తెలిసింది. డీసీఏ, సెర్ట్-ఇన్ వంటి సంస్థల హెచ్చరికలతో ఈ వ్యవహారం బయటపడింది. డార్క్‌వెబ్‌లో ఉన్న 3.75 లక్షల రికార్డులను విశ్లేషించగా.. అందులో 3,897 మంది ఎస్‌బీఐ కస్టమర్ల వివరాలు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన ఎస్‌బీఐ యాక్షన్ ప్రోటోకాల్‌ను యాక్టివేట్ చేసింది. దీనిపై సమగ్ర విచారణ జరిపేందుకు సెర్ట్-ఇన్ ప్యానెల్‌లోని స్వతంత్ర సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీని రంగంలోకి దించింది. అయితే, ఈ సైబర్ దాడి వల్ల బ్యాంకు కోర్ ఆర్థిక లావాదేవీలు, డిజిటల్ సేవలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడలేదని ఎస్‌బీఐ స్పష్టం చేసింది. ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రోజువారీ బ్యాంకింగ్ కార్యకలాపాలు యథాతథంగా కొనసాగుతున్నాయని భరోసా ఇచ్చింది.



వకుళాభరణం రచనా కృషికి ప్రశంస!

గవర్నర్‌ను కలిసిన బీసీ కమిషన్ మాజీ చైర్మన్ ..పుస్తకాల అందజేత

లోక్‌భవన్‌లో ఆప్యాయ పలకరింపు.. వ్యాపకాన్ని కొనసాగించాలని గవర్నర్ సూచన

హైదరాబాద్, అక్టోబర్ 21 : బీసీ కమిషన్ మాజీ చైర్మన్, రచయిత డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు రచనా కృషిని గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఉత్తమ వ్యాపకాన్ని ఇలాగే కొనసాగించాలని సూచించారు. లోక్‌భవన్‌లో గవర్నర్‌ను వకుళాభరణం తన సతీమణి సుధాశ్రీతో కలిసి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయదశమి సందర్భంగా జమ్మి ఆకులు అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. తాను రచించిన 'సామాజిక న్యాయం - ఆర్థిక సమానత్వం - అభివృద్ధి దిశగా జీఎస్టీ', 'శ్రీ నరేంద్ర మోదీ: భారత్‌ను విశ్వ వేదికపై నిలిపిన మహానాయకుడు', 'అంత్యోదయం నుంచి వికసిత్ భారత్', 'మోడీ వాణి: సేవ సంకల్పం, వికసిత భారత్' తదితర పుస్తకాలను వకుళాభరణం గవర్నర్‌కు అందజేశారు. పుస్తకాలను స్వీకరించిన గవర్నర్, అందులోని ముఖ్యాంశాలపై ఆయనతో ఆసక్తిగా చర్చించారు. అనంతరం వకుళాభరణం దంపతులతో గవర్నర్ ఆప్యాయంగా ముచ్చటించి వారి కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో బీసీ కమిషన్ చైర్మన్‌గా, సభ్యుడిగా వకుళాభరణం చేపట్టిన కార్యక్రమాలు, అనుభవాలను శ్రద్ధగా విన్నారు. ఈ భేటీలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దానకిశోర్ కూడా పాల్గొన్నారు. గవర్నర్ చూపిన ఆప్యాయత, ప్రశంసలు తన రచనా వ్యాసంగానికి మరింత ప్రోత్సాహాన్నిచ్చాయని వకుళాభరణం పేర్కొన్నారు.



సమాజాన్ని చీల్చేవారే దేశ శత్రువులు!

భారతీయ సంస్కృతిని ద్వేషించే శక్తులపై ఐక్యంగా పోరాడాలి

'దేశమే ప్రథమం' అనే సంకల్పంతో ముందుకు సాగాలి

ఢిల్లీ రావణ దహన వేడుకల్లో ప్రధాని మోదీ పిలుపు

శ్రీరాముడి ఆదర్శాలు, రామరాజ్య స్థాపనే మన లక్ష్యం

వికసిత్ భారత్ సాధన కోసం రాజకీయ పార్టీలు ఏకం కావాలి

న్యూఢిల్లీ, అక్టోబర్ 21 : సమాజంలో విభేదాలు సృష్టించే వ్యక్తులు, దేశ గౌరవాన్ని దెబ్బతీసే శక్తులు, భారతీయ సంస్కృతిని ద్వేషించే మనస్తత్వం ఉన్నవారిని దేశ శత్రువులుగా గుర్తించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. అలాంటి శక్తులను దీటుగా ఎదుర్కొనేందుకు ప్రజలంతా ఐక్యంగా నిలవాలని, 'దేశమే ప్రథమం' అనే సంకల్పంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని న్యూఢిల్లీలోని ఐపీ ఎక్స్‌టెన్షన్‌లో నిర్వహించిన రావణ దహన కార్యక్రమంలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. 'సియావర్ రామచంద్ర కీ జై' అంటూ ప్రసంగాన్ని ప్రారంభించిన మోదీ.. శ్రీరాముడి ఆదర్శాలు భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని పేర్కొన్నారు. కేవలం రావణుడిని సంహరించినందుకే కాకుండా, మానవాళికి విలువైన జీవన సందేశాలను అందించినందుకే శ్రీరాముడిని మనం ఆరాధిస్తామన్నారు. రాజ్యాధికారం లభిస్తుందన్న ఆనందమైనా, వనవాసానికి వెళ్లాల్సి వచ్చిందన్న బాధైనా ఆయనను ధర్మమార్గం నుంచి తప్పించలేకపోయాయని గుర్తుచేశారు. వివక్షకు తావులేకుండా ప్రతి ఒక్కరికీ న్యాయం, సమాన అవకాశాలు కల్పించడం, అధికారం కేవలం ప్రజల సంక్షేమానికే ఉపయోగపడటం రామరాజ్య ప్రధాన లక్షణాలని వివరించారు. గోస్వామి తులసీదాస్ బోధనల ప్రకారం ప్రజలనే దేవుళ్లుగా భావించి (నాగరిక దేవో భవః) సుపరిపాలన సాగించాలని, పేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేయాలని సూచించారు.

సొంత సామర్థ్యంపై నమ్మకం ముఖ్యం..

సంక్షోభాలు, సవాళ్లు ఎంత క్లిష్టంగా ఉన్నా ఇతరులపై ఆధారపడకుండా సొంత సామర్థ్యాన్ని విశ్వసించాలని ప్రధాని సూచించారు. సముద్రం అడ్డుగా ఉన్నా, లంక దూరంగా ఉన్నా శ్రీరాముడు ఏమాత్రం వెనుకడుగు వేయకుండా, ప్రజల సమష్టి శక్తితో అసాధ్యమైన లక్ష్యాన్ని సుసాధ్యం చేశారని గుర్తుచేశారు. ఆత్మవిశ్వాసం, దృఢ సంకల్పమే విజయానికి కీలకమన్నారు. దేశం ముందున్న 'వికసిత్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాల సాధనకు ప్రజల సమష్టి కృషి ఎంతో అవసరమన్నారు. జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో రాజకీయ పార్టీలన్నీ భేదాభిప్రాయాలు పక్కనబెట్టి ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. విజయదశమి పర్వదినం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ సంకల్పాన్ని పునరుద్ఘాటించుకోవాలని మోదీ కోరారు. భారతమాత శత్రువులను గుర్తించి ఓడించేందుకు 'రాష్ట్ర ప్రథమ్' భావనతో అడుగులు వేయాలన్నారు. అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ సమయంలో తాను ప్రకటించిన 'రాముడి నుంచి రాష్ట్రం.. దేవుడి నుంచి దేశం' అనే సంకల్పాన్ని తప్పకుండా సాకారం చేస్తామని ప్రధాని ఈ సందర్భంగా విశ్వాసం వ్యక్తం చేశారు.

భారత్‌లో జోక్యం చేసుకోం!

యూఎన్ వ్యాఖ్యలపై రూబియో స్పందన

అది భారత్ అంతర్గత వ్యవహారం

వారిది కేవలం భిన్నాభిప్రాయమే

దేశీయ రాజకీయాలపై స్పందించను

వాషింగ్టన్, అక్టోబర్ 21: భారతదేశ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన ఆందోళనల అణచివేతపై ఐక్యరాజ్యసమితి (యూఎన్) నిపుణులు చేసిన వ్యాఖ్యలపై అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో స్పందించారు. భారత్ అంతర్గత వ్యవహారాల్లో తాము జోక్యం చేసుకోబోమని ఆయన తేల్చిచెప్పారు. యూఎన్ నిపుణులు వ్యక్తం చేసిన ఆందోళనను ఆయన తోసిపుచ్చారు. వారిని ఐక్యరాజ్యసమితి నిపుణులుగా పరిగణించలేమని, కేవలం భిన్నమైన అభిప్రాయాలు కలిగిన వ్యక్తులుగా మాత్రమే చూడాలని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసనలు, ఆందోళనలు సహజమైన భాగమేనని ఆయన పేర్కొన్నారు. ఇటీవల భారత్‌లో నిరసనకారుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు, ఆందోళనల నియంత్రణపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని 20 మందికి పైగా ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల నిపుణులు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో మార్కో రూబియో చేసిన వ్యాఖ్యలు అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. యూఎన్ నిపుణుల ఆందోళనల నడుమ ఈ వ్యవహారంపై అమెరికా వైఖరిని రూబియో కుండబద్దలు కొట్టారు.



శాంతియుత, హింసాత్మక ఆందోళనలకు తేడా ఉంది..

భారతదేశం ఒక బలమైన ప్రజాస్వామ్య దేశమని, అక్కడ క్రమం తప్పకుండా పకడ్బందీగా ఎన్నికలు జరుగుతున్నాయని రూబియో గుర్తుచేశారు. ఆ దేశ అంతర్గత రాజకీయాలపై తాను ఎలాంటి అభిప్రాయాలు వెల్లడించబోనని స్పష్టం చేశారు. అయితే నిరసనల విషయంలో శాంతియుత ఆందోళనలకు, హింసాత్మక ఘటనలకు మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే క్రమంలో యూరప్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలను ఆయన ప్రస్తావించారు. అమెరికాలో సైతం ప్రతిరోజూ ఏదో ఒక చోట నిరసనలు జరుగుతూనే ఉంటాయన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసనలకు స్థానం ఉన్నప్పటికీ.. వాటి స్వరూపాన్ని బట్టి పరిస్థితులను అంచనా వేయాల్సి ఉంటుందని రూబియో స్పష్టం చేశారు.

సంపాదకీయం



జైలు గోడల మధ్యే గ్యాంగ్‌స్టర్ బిష్ణోయ్

కేంద్రం నిబంధనలు అతనికి ఎలా ప్లస్ అవుతున్నాయి?

పోలీసుల విచారణకు కేంద్రం ఆంక్షలు!

బిష్ణోయ్‌ను బయటకు తరలించకుండా కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు


జైలు ప్రాంగణం, దృశ్యమాధ్యమం ద్వారానే విచారణకు అవకాశం

టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పుల ఘటనతో మళ్లీ తెరపైకి వివాదం

కేంద్రం ఆంక్షలను ఎత్తివేయాలంటూ కాంగ్రెస్ నేత హర్షవర్ధన్ డిమాండ్

దేశవ్యాప్తంగా పలు సంచలన నేరాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌ను నేరుగా విచారించేందుకు ముంబై పోలీసులకు చట్టపరమైన అడ్డంకులు ఎదురవుతున్నాయి. గుజరాత్‌లోని సబర్మతి జైలులో ఉన్న అతడిని ఇతర ప్రాంతాలకు తరలించకుండా కేంద్ర హోంశాఖ జారీ చేసిన ఉత్తర్వులు దర్యాప్తు సంస్థలకు ప్రధాన అవరోధంగా మారినట్లు సమాచారం. ముంబైలో జరిగిన పలు నేర ఘటనల్లో బిష్ణోయ్ గ్యాంగ్ పేరు వినిపిస్తున్నప్పటికీ అతడిని పోలీసు కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు అవకాశం లేకపోవడంపై చర్చ జరుగుతోంది. తాజాగా బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పులు జరిగినట్లు వచ్చిన వార్తలు, ఆ ఘటనకు బిష్ణోయ్ గ్యాంగ్ బాధ్యత వహించినట్లు సామాజిక మాధ్యమాల్లో వెలువడిన ప్రకటనల నేపథ్యంలో ఈ వ్యవహారం మరోసారి ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే తాజా ఘటనలో బిష్ణోయ్ లేదా అతడి ముఠా ప్రమేయం దర్యాప్తులో నిర్ధారణ కావాల్సి ఉంది. కేంద్ర హోంశాఖ 2023 ఆగస్టులో అప్పటి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 268 కింద లారెన్స్ బిష్ణోయ్‌ను జైలు నుంచి బయటకు తరలించకుండా ఉత్తర్వులు జారీ చేసినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. భద్రతాపరమైన కారణాలతో ఖైదీని జైలు నుంచి ఇతర ప్రాంతాలకు తరలించడంపై పరిమితులు విధించేందుకు ఈ నిబంధన అవకాశం కల్పిస్తుంది. కొత్త నేర న్యాయ చట్టాలు అమల్లోకి వచ్చిన తర్వాత సంబంధిత నిబంధనల కింద ఆ ఆంక్షలను కొనసాగించినట్లు సమాచారం. ఈ ఉత్తర్వుల కారణంగా బిష్ణోయ్‌ను ఇతర రాష్ట్రాలకు తీసుకెళ్లి విచారించే విషయంలో దర్యాప్తు సంస్థలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. సాధారణంగా ఒక నేరానికి సంబంధించి జైలులో ఉన్న నిందితుడిని విచారించాల్సి వస్తే దర్యాప్తు సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించి తగిన అనుమతులు పొందుతాయి. అయితే బిష్ణోయ్ విషయంలో జైలు నుంచి తరలింపుపై ప్రత్యేక ఆంక్షలు అమల్లో ఉండటంతో ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లే ప్రక్రియ సంక్లిష్టంగా మారింది. ఈ పరిస్థితుల్లో జైలు ప్రాంగణంలోనే విచారణ జరపడం లేదా దృశ్యమాధ్యమం ద్వారా ప్రశ్నించడం వంటి ప్రత్యామ్నాయాలను దర్యాప్తు సంస్థలు ఉపయోగించాల్సి వస్తోంది. అయితే ఈ ఉత్తర్వులు బిష్ణోయ్‌కు నేర విచారణ నుంచి మినహాయింపు కల్పించవని, ప్రధానంగా అతడి తరలింపునకు సంబంధించినవేనని న్యాయపరంగా గుర్తించాల్సి ఉంటుంది. ముంబైలో చోటుచేసుకున్న పలు సంచలన ఘటనల్లో బిష్ణోయ్ గ్యాంగ్‌పై ఆరోపణలు వినిపించాయి. బాంద్రా వెస్ట్‌లోని బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ నివాసం వద్ద కాల్పుల ఘటన, ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ హత్య, దర్శకుడు రోహిత్ శెట్టికి బెదిరింపులు వంటి వ్యవహారాల్లో ఈ ముఠా పేరు ప్రస్తావనకు వచ్చింది. ఈ కేసుల్లో సంబంధిత నిందితుల పాత్ర, కుట్ర వెనుక ఉన్న వ్యక్తుల ప్రమేయంపై దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టాయి. అయితే ఒక్కో కేసులో ఆరోపణలు, సేకరించిన ఆధారాలు, న్యాయస్థానాల నిర్ణయాలను వేర్వేరుగా పరిగణించాల్సి ఉంటుంది.

టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పుల కలకలం



అక్టోబర్ 18న ముంబైలోని జుహు ప్రాంతంలో బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ కారుపై ముగ్గురు దుండగులు కాల్పులు జరిపినట్లు సమాచారం వెలువడింది. ఈ ఘటనకు తమదే బాధ్యతంటూ బిష్ణోయ్ గ్యాంగ్ పేరుతో సామాజిక మాధ్యమాల్లో ప్రకటన వచ్చినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఈ కేసుకు సంబంధించి అనుమానితులను రాజస్థాన్‌లోని కోటా రైల్వే స్టేషన్ సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ప్రకటన ప్రామాణికత, నిందితుల సంబంధాలు, ఘటన వెనుక ఉన్న కుట్రపై అధికారిక దర్యాప్తు వివరాలు వెల్లడికావాల్సి ఉంది. పలు రాష్ట్రాలకు విస్తరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నేర ముఠాల కార్యకలాపాలపై దర్యాప్తు చేయడంలో నిందితుల మధ్య సంబంధాలు, ఆర్థిక లావాదేవీలు, సమాచార మార్పిడి, ఆదేశాలు అందిన విధానం వంటి అంశాలు కీలకంగా ఉంటాయి. బిష్ణోయ్‌ను నేరుగా పోలీసు కస్టడీలోకి తీసుకోలేకపోవడం వల్ల కుట్ర వెనుక ఉన్న పూర్తి వివరాలను సేకరించడం కష్టమవుతోందని పోలీసు వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. అయితే జైలు ప్రాంగణంలో విచారణ, దృశ్యమాధ్యమం ద్వారా ప్రశ్నించడం, ఇతర నిందితుల వాంగ్మూలాలు, సాంకేతిక ఆధారాల సేకరణ వంటి దర్యాప్తు మార్గాలు అందుబాటులోనే ఉంటాయి.

ఛోటా రాజన్‌కూ ఇలాంటి ఆంక్షలే.. ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్

గతంలో అండర్‌వరల్డ్ నేరస్థుడు ఛోటా రాజన్ విషయంలోనూ భద్రతా కారణాలతో జైలు నుంచి తరలింపుపై ప్రత్యేక పరిమితులు అమలు చేసినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ విషయంలోనూ ఇలాంటి ఏర్పాట్లు ఉన్నట్లు సమాచారం. అయితే ఆయా వ్యక్తులపై అమల్లో ఉన్న ఉత్తర్వుల పరిధి, చట్టపరమైన కారణాలు ఒకే విధంగా ఉన్నాయో లేదో సంబంధిత అధికారిక పత్రాల ఆధారంగా నిర్ధారించాల్సి ఉంటుంది. లారెన్స్ బిష్ణోయ్‌ను జైలు నుంచి తరలించకుండా అమలు చేస్తున్న ఆంక్షలను ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ నేత హర్షవర్ధన్ సప్కల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కోరినట్లు సమాచారం. ముంబైలో వరుస నేర ఘటనల నేపథ్యంలో దర్యాప్తు సంస్థలకు అవసరమైన సహకారం అందించాలని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు నేరాలకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

మార్కెట్‌పై డ్రోన్ దాడి.. 153 మంది మృతి!

- సూడాన్-దక్షిణ సూడాన్ సరిహద్దులో ఘోర విషాదం
- అబ్యేలోని అమియెట్ మార్కెట్‌పై విరుచుకుపడిన డ్రోన్
- ఇంధన డిపో ధ్వంసం..
- మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదముందన్న స్థానిక అధికారులు



అబ్యే, అక్టోబర్ 21 (సమయం న్యూస్): సూడాన్, దక్షిణ సూడాన్ మధ్య వివాదాస్పద సరిహద్దు ప్రాంతమైన అబ్యేలో ఘోర విషాదం చోటుచేసుకుంది. జనసంచారం ఎక్కువగా ఉండే అమియెట్ మార్కెట్‌పై జరిగిన డ్రోన్ దాడిలో కనీసం 153 మంది ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. మార్కెట్ సమీపంలోని ఇంధన డిపో కూడా దాడిలో దెబ్బతినడంతో భారీగా మంటలు చెలరేగాయి. సోమవారం ఉదయం జరిగిన ఈ దాడి అనంతరం మంగళవారం వరకు మంటలు కొనసాగినట్లు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోందని, పరిస్థితి అత్యంత భయానకంగా ఉందని అబ్యే తాత్కాలిక సమాచార శాఖ మంత్రి యోహన్నా అకోల్ న్గోర్ వెల్లడించారు. ఈ దాడికి సూడాన్ సైన్యమే కారణమని ఆయన ఆరోపించారు. అయితే దాడికి పాల్పడినవారి గుర్తింపు, దాడి వెనుక కారణాలను స్వతంత్రంగా నిర్ధారించలేకపోయినట్లు అసోసియేటెడ్ ప్రెస్ పేర్కొంది. మరోవైపు ఈ ఘటనపై దక్షిణ సూడాన్ ప్రభుత్వం తీవ్ర నిరసన వ్యక్తం చేసింది.

153 మరణాలు నమోదు చేశాం

అబ్యే పరిపాలన యంత్రాంగం తాత్కాలిక సమాచార శాఖ మంత్రి యోహన్నా అకోల్ న్గోర్ ఈ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు 153 మంది మరణించినట్లు నమోదు చేశామని మంగళవారం అసోసియేటెడ్ ప్రెస్‌కు ఫోన్ ద్వారా వెల్లడించారు. మంటలు కొనసాగుతున్న నేపథ్యంలో మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదముందని పేర్కొన్నారు. దాడి జరిగిన ప్రాంతంలో పరిస్థితి భయానకంగా ఉందని వివరించారు. మార్కెట్‌పై జరిగిన ఈ దాడికి సూడాన్ సైన్యమే బాధ్యత వహించాలని ఆయన ఆరోపించారు. అయితే ఈ ఆరోపణను స్వతంత్రంగా ధ్రువీకరించే సమాచారం అప్పటికి అందుబాటులోకి రాలేదు. డ్రోన్ దాడిలో గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. డాక్టర్స్ విత్‌ౌట్ బోర్డర్స్‌గా ప్రసిద్ధి చెందిన అంతర్జాతీయ వైద్య సహాయ సంస్థ ఎంఎస్ఎఫ్ ప్రకారం, 20 మందికి పైగా క్షతగాత్రులను అమెత్ బెక్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ ఎంఎస్ఎఫ్ వైద్య బృందాలు దక్షిణ సూడాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ సిబ్బందితో కలిసి చికిత్స అందిస్తున్నాయి. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. కాలిన గాయాలతో బాధపడుతున్నవారు కూడా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. అమెత్ బెక్ ఆసుపత్రిలో ఎంఎస్ఎఫ్ వైద్య కార్యకలాపాల మేనేజర్ డాక్టర్ క్రిస్టియన్ లిండోర్ ఘటన తీవ్రతను వివరించారు. ఇప్పటివరకు 20 మందికి పైగా క్షతగాత్రులు ఆసుపత్రికి వచ్చారని, వారిలో పలువురి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. కాలిన గాయాలతో బాధపడుతున్నవారికి కూడా చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. తీవ్ర గాయాలతో ఆసుపత్రులకు చేరుతున్నవారికి అత్యవసర వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దాడి కారణంగా సాధారణ ప్రజలకు వైద్య సేవలు, ఇతర నిత్యావసర సదుపాయాలు అందుబాటులో ఉండటంపైనా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అమియెట్ మార్కెట్‌పై జరిగిన డ్రోన్ దాడికి సూడాన్ సైన్యమే కారణమని దక్షిణ సూడాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆరోపించింది. మార్కెట్‌లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దాడి జరగడంతో పౌరులు మరణించారని, ఆస్తులకు భారీ నష్టం వాటిల్లిందని పేర్కొంది. ఈ ఘటనపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ సూడాన్ రాయబారిని పిలిపించినట్లు వెల్లడించింది. పౌరుల ప్రాణాలకు, ఆస్తులకు ప్రమాదం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూడాన్‌ను కోరింది. అబ్యే ప్రాంతానికి సంబంధించిన వివాదాలను సైనిక చర్యల ద్వారా కాకుండా దౌత్య మార్గాల్లో పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేసింది. సూడాన్, దక్షిణ సూడాన్ మధ్య అబ్యే ప్రాంతంపై చాలాకాలంగా వివాదం కొనసాగుతోంది. ఇరు దేశాల సరిహద్దులో ఉన్న ఈ ప్రాంతం భద్రతాపరంగా అత్యంత సున్నితమైనదిగా పరిగణించబడుతోంది. మరోవైపు సూడాన్‌లో 2023 ఏప్రిల్ నుంచి సైన్యం, పారామిలిటరీ రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ మధ్య జరుగుతున్న అంతర్యుద్ధం దేశంలోని అనేక ప్రాంతాలను తీవ్రంగా దెబ్బతీసింది. ఈ ఘర్షణల ప్రభావం సరిహద్దు ప్రాంతాల స్థిరత్వంపైనా పడుతోంది.

'పురుషాధిక్య వర్గం'గా ఆర్ఎస్ఎస్

- మహిళలను పురుషుల ఆస్తిగా చూసే ఆర్ఎస్ఎస్‌తో నా పోరాటం ఆగదు!
- నేను శివశక్తిని నమ్ముతా.. అందుకే ఆర్ఎస్ఎస్‌తో పోరాడటం ఆనందం
- ఆర్ఎస్ఎస్ పురుషాధిక్య భావజాలంపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు
- కేవలం పురుషులతో కూడిన రాజ్యాంగ వ్యతిరేక సంస్థ అంటూ ఆరోపణ



న్యూఢిల్లీ, అక్టోబర్ 21 (సమయం న్యూస్): ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పై చేసిన తీవ్ర దాడి రాజకీయ దుమారాన్ని రేపగా, బీజేపీ నుంచి గట్టి ప్రతిస్పందనను ఎదుర్కొంది. మంగళవారం 'ఎక్స్' ప్లాట్‌ఫామ్‌లో పెట్టిన ఒక పోస్ట్‌లో, గాంధీ ఆర్ఎస్ఎస్‌ను "కేవలం పురుషులతో కూడిన రాజ్యాంగ వ్యతిరేక సంస్థ" అని అభివర్ణించారు. అంతేకాకుండా, ఆ సంస్థ మహిళలను పురుషుల కంటే తక్కువగా చూస్తుందని ఆరోపించారు. "ఆర్ఎస్ఎస్ అనేది కేవలం పురుషులతో కూడిన, రాజ్యాంగ వ్యతిరేక సంస్థ. మహిళలు పురుషుల ఆస్తి అని అది నమ్ముతుంది," అని ఆయన 'ఎక్స్' ప్లాట్‌ఫామ్‌లో పోస్ట్ చేశారు. ఆర్ఎస్ఎస్‌తో పోరాడటం తనకు ఆనందాన్నిస్తుందని గాంధీ తెలిపారు. సంఘ్‌కు చెందిన 'సొంత' మహిళలు కూడా చాలామంది తనతో ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

'సొంత' మహిళలు చాలామంది నా పక్షాన ఉన్నారు: రాహుల్

"నేను శివ-శక్తిని నమ్ముతాను. అందుకే వారితో పోరాడటం నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. అందమైన విషయం ఏమిటంటే, వారి 'సొంత' మహిళలు చాలామంది నా పక్షాన ఉన్నారు," అని గాంధీ రాశారు. గాంధీ చేసిన వ్యాఖ్యలపై విరుచుకుపడిన మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే రామ్ కదమ్, ఆయనకు సరైన అవగాహన లేదని పేర్కొంటూ, ఆర్ఎస్ఎస్‌లో మహిళా విభాగం కూడా క్రియాశీలంగా పనిచేస్తోందని గుర్తు చేశారు. "రాహుల్ గాంధీ తరచుగా ఆర్ఎస్ఎస్ గురించి వ్యాఖ్యలు చేస్తుంటారు. రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు మరియు తీవ్ర విమర్శలు చేసే హక్కు ఆయనకు ఉన్నప్పటికీ, ఏదైనా మాట్లాడే ముందు ఆయన సరైన అధ్యయనం చేయాలి. ఆర్ఎస్ఎస్‌లో మహిళల కోసం కూడా ఒక విభాగం ఉందని ఆయనకు తెలియదా? ఇది దేశవ్యాప్తంగా పనిచేస్తోంది; ఇందులో మహిళలు పురుషులతో సమానమైన ప్రాముఖ్యతతో పనిచేస్తున్నారు" అని కదమ్ అన్నారు.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలు పిల్లచేష్టలు: బీజేపీ

ఇలాంటి 'పిల్లచేష్టల' వ్యాఖ్యలు ప్రతిపక్ష నాయకుడికి తగవని ఆయన అన్నారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, రాహుల్ గాంధీని ఉద్దేశించి, "మీ సొంత పార్టీలోనే ఎంతమంది మహిళలు కీలక పదవులు పొందారు?" అని ప్రశ్నించారు. "రాహుల్ గాంధీ తన పార్టీ ఎంత పురుషాధిక్యతతో ఉందో మరిచిపోతున్నట్లుంది. వారు ఎక్కడ అధికారంలో ఉన్నా, అక్కడ ఎంతమంది మహిళా ముఖ్యమంత్రులు ఉన్నారో సమాధానం చెప్పాలి. రాజధానిలో బీజేపీకి ఒక మహిళా ముఖ్యమంత్రి ఉన్నారు," అని రావు ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్ అధిపతి హెచ్చరిక ఆయన మహిళా రిజర్వేషన్ల అంశాన్ని కూడా లేవనెత్తి, దానిని కాంగ్రెస్ అడ్డుకుంటోందని ఆరోపించారు.

టైగర్ ష్రాఫ్ కాదు.. అసలు టార్గెట్ సల్మాన్!

- బాలీవుడ్ కాల్పుల కేసులో సంచలన మలుపు
- గుజరాత్‌లో మరో నిందితుడి అరెస్టు

ముంబై, అక్టోబర్ 21 (సమయం న్యూస్): బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల ఉదంతం మరో మలుపు తిరిగింది. తాము మొదట నటుడు సల్మాన్ ఖాన్‌ను టార్గెట్ చేశామని నిందితులు పోలీసులకు చెప్పినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ కేసుకు సంబంధించి హర్యానాకు చెందిన ఇద్దరు షూటర్లను, బిహార్‌కు చెందిన మరొకరిని రాజస్థాన్‌లో పోలీసులు అరెస్టు చేసి ముంబైకి తరలించారు. అంతేకాకుండా, హర్యానాకు చెందిన ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు షూటర్లకు ఆయుధాలను సరఫరా చేసినట్లు తెలుస్తోంది. విచారణ సమయంలో నిందితులు కునాల్ అనే వ్యక్తి గురించి చెప్పడంతో అతడినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మీడియా కథనాల ప్రకారం.. ముగ్గురు షూటర్లు మొదట నటుడు సల్మాన్ ఖాన్ ఇంటి వద్ద రెక్కీ నిర్వహించారు. అయితే, సల్మాన్ ఇంటి ముందు పోలీసు బందోబస్తు పటిష్ఠంగా ఉండటంతో వెనక్కు తగ్గారు. మరో సులువైన టార్గెట్ కోసం వెతుకుతుండగా వారి దృష్టి టైగర్ ష్రాఫ్‌పై పడింది. ప్రతి ఆదివారం ఆయన జుహూ ప్రాంతంలోని ఫుట్ బాల్ గ్రౌండ్‌కు వస్తారని అభిమానుల ఫేస్‌బుక్ పేజీ ద్వారా తెలుసుకున్నారు. అక్కడ భద్రత కూడా తక్కువగా టుందని గ్రహించి ఆదివారం సాయంత్రం టైగర్ ష్రాఫ్‌ను టార్గెట్ చేశారు.

చెప్పినా వినలేదు.. అందుకే..

టైగర్ ష్రాఫ్‌పై కాల్పులకు తామే బాధ్యులమని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన అనిల్ పండిట్, హర్మన్ సంధూ ప్రకటించారు. సల్మాన్‌తో పని చేసిన వారందరూ తమ టార్గెట్ అని వార్నింగ్ ఇచ్చారు. టైగర్ ష్రాఫ్‌కు అంతకుముందే కాల్ చేసి హెచ్చరించినా వినిపించుకోలేదని చెప్పారు. దీంతో, విషయం అర్థమయ్యేలా మరోసారి చెప్పామని వ్యాఖ్యానించారు.

మరో వ్యక్తి అరెస్టు

బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పుల ఘటనకు సంబంధించిన కేసులో ముంబై పోలీసులు మరో వ్యక్తిని అరెస్టు చేశారు. అతడిని గుజరాత్‌లోని బరోడాలో అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తిని అంకిత్‌గా గుర్తించారు. అతడిని అరెస్టు చేసిన తర్వాత హర్యానాలోని గోహనా కోర్టులో హాజరుపరిచారు. తర్వాత ట్రాన్సిట్ రిమాండ్‌పై ముంబైకి తరలించారు. గోహనా పోలీసులు, ముంబై పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి అంకిత్‌ను అరెస్టు చేశారు.

లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలపై ఆరా

లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు సన్నిహితుడిగా పేరున్న అనిల్ పండిట్‌తో అంకిత్‌కు సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. కాల్పుల ఘటనకు సంబంధించిన కుట్రలో అంకిత్ పాత్ర ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంకిత్, నేపాల్, అనిల్ పండిట్‌ల మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు కూడా దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. ఈ లావాదేవీల వెనుక ఉన్న కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ నెట్‌వర్క్‌తో అంకిత్‌కు ఉన్న సంబంధాలు, కుట్రలో అతడి పాత్రపై మరింత లోతుగా విచారణ జరపనున్నారు.

కోటా నుంచి ముంబైకి ముగ్గురు నిందితులు



టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పుల ఘటనలో కీలక నిందితులుగా భావిస్తున్న ముగ్గురిని బుధవారం రాజస్థాన్‌లోని కోటా నుంచి ముంబైకి తీసుకొచ్చినట్లు పోలీసులు తెలిపారు. కోటా నుంచి రోడ్డు మార్గంలో ముంబైకి తరలించిన అనంతరం వైద్య పరీక్షల కోసం వారిని జేజే ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు పూర్తయ్యాక విచారణ కోసం ముంబై క్రైమ్ బ్రాంచ్‌లోని యాంటీ ఎక్స్‌టార్షన్ సెల్ (ఏఈసీ) కార్యాలయానికి తరలించారు. కాగా.. నిందితులను హర్యానాలోని సోనిపట్‌కు చెందిన రెహాన్ అలియాస్ సుక్కా, బిహార్‌లోని బెగుసరాయ్‌కు చెందిన రితిక్ కుర్మీ అలియాస్ రోషన్, హర్యానాకు చెందిన ఫూల్ సింగ్‌గా గుర్తించారు. కోటా నగర పోలీసులు వీరిని ముంబై పోలీసులకు అప్పగించగా, ముంబై పోలీసులు అధికారికంగా అరెస్టు చేసి స్థానిక మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. నిందితులను ముంబైకి తరలించేందుకు కోర్టు ట్రాన్సిట్ రిమాండ్ మంజూరు చేసింది. మరోవైపు నిందితుల తరఫున వాదనలు వినిపించేందుకు అజింక్య మిర్గల్ అనే అడ్వొకేట్ బుధవారం ఉదయం ఏఈసీ కార్యాలయానికి చేరుకున్నారు.

'సింగర్ వరం'కు సినీ నటుడు 'గుండు రవితేజ' సన్మానం



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 21, :

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పే లక్ష్యంతో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ 2026'లో పాటల విభాగంలో ప్రథమ బహుమతిగా గోల్డ్ అవార్డు సాధించిన సింగర్ వరంను హైదరాబాద్ లో సినీ నటుడు గుండు రవితేజ బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గుండు రవితేజ తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టే గొల్లభామ చేనేత శాలువాతో సింగర్ వరంను సత్కరించి, అభినందనలు తెలిపారు. తెలంగాణ కళలు, సంస్కృతి, సంప్రదాయాలను తన గాత్రం ద్వారా మరింత ప్రాచుర్యంలోకి తీసుకువచ్చి, ప్రతిష్ఠాత్మకమైన గోల్డ్ అవార్డును సాధించడం అభినందనీయమని గుండు రవితేజ పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించి, తెలంగాణ రాష్ట్రానికి మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఘనంగా దుర్గామాత శోభాయాత్ర



కుకునూరుపల్లి, అక్టోబర్ 21, :

గజ్వేల్ నియోజకవర్గం కుకునూరుపల్లి మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో బుధవారం దుర్గామాత శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం శోభాయాత్రను ప్రారంభించారు. దుర్గామాత శోభాయాత్ర గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరంతా ఉత్సాహంగా సాగింది. గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ఘన స్వాగతం పలికారు. అమ్మవారి నామస్మరణలు, భక్తి గీతాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో శోభాయాత్రలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఇంద్ల కనకయ్య, ఉపాధ్యక్షులు ఈగ ప్రశాంత్, క్యాషియర్ అన్నమైన బాలనర్సయ్య, కొంతం కర్ణాకర్, రాయారపు శ్రీనివాస్, కొంతం రవీందర్, ఇంద్ల శ్రీశైలం, కొంతం నాగరాజు, ప్రధాన అర్చకులు శివగోవింద శర్మ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన మంత్రి అడ్లూరి

జగిత్యాల/వెల్గటూర్, అక్టోబర్ 21, :



వెల్గటూర్ మండలంలోనీ కిషన్ రావు పేట గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొమురయ్య, శ్రీనివాస్ల కుటుంబాన్ని రాష్ట్ర సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం గుండెపోటుతో మృతి చెందిన మొకనపెల్లి చంద్రయ్య కుటుంబాన్ని పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని, కుటుంబాన్ని ఆదుకునేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సప్ప తిరుపతి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

దమ్మపేట వచ్చిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

- **ఉప సర్పంచ్ కు డివైడర్ పై వక్క మొక్కలు నాటాలి అని ఆదేశం**

దమ్మపేట, అక్టోబర్ 21, :

దమ్మపేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఫంక్షన్ హాల్ లాడ్జీని బుధవారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు సందర్శించి యజమాని కక్కిరాల దుర్గాప్రసాద్ ను అభినందించారు. ఈ సందర్భంగా కక్కిరాల కుటుంబ సభ్యులు మంత్రి తుమ్మలను శాలువాతో సత్కరించారు మహిళా కుటుంబ సభ్యులను ఆప్యాయంగా మాట్లాడి వచ్చిన గ్రామస్తులు అందరినీ పేరు పేరున పలకరించారు. ఈ సందర్భంగా తుమ్మల



మాట్లాడుతూ దమ్మపేట మండల కేంద్రాను సుందరీకరణలో భాగంగా డివైడర్ పై పూల మొక్కలతో పాటు నిలువుగా పెరిగే వక్క చెట్లను పెంచడం ద్వారా రహదారులు అందంగా కనిపించడమే కాకుండా ప్రభుత్వానికి, పర్యావరణానికి ప్రయోజనం కలుగుతుందని తద్వారా రాష్ట్రంలో పలు డివైడర్ల పై నాటడానికి నాందిగా దమ్మపేట మండలపల్లి డివైడర్ ఆదర్శం అవుతుంది అని గ్రామ ఉపసర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, పగడాల రాంబాబు లకు తెలియజేశారు. ఇట్టి విషయంను లోగడ మీరు నన్ను కలవడానికి వచ్చినప్పుడు చెప్పాను అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కక్కిరాల రమేష్, శివకృష్ణ, రామకృష్ణ, గడ్డిపాటి సత్యం, దొడ్డా ప్రసాదరావు, పైడి వెంకటేశ్వరరావు, గొట్టిపుల్ల దుర్గా శ్రీనివాస్, అత్తలూరి వెంకట రామారావు, కే.వి సత్యనారాయణ, దొడ్డాకుల రాజేశ్వరరావు, కొయ్యల అచ్యుతరావు, దారా మల్లిఖార్జునరావు, యుగంధర్, నాగేశ్వరరావు, శివాజీ, మాధవరావు, కిషోర్, బవిరిశెట్టి రాము, ఎం.డి వలీపాష, చిన్నశెట్టి చిట్టిబాబు, కాసాని నాగప్రసాద్, పసుమర్తి రామభద్రం, పానుగంటి లక్ష్మణ్ గౌడ్, రాంబాబు, వనమాల శ్రీనివాసరావు, సూరిబాబు, కొంకా శ్రీనివాసరావు, పెరుమాళ్ళ కృష్ణమూర్తి, అన్నవరపు నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

చెడుపై మంచి సాధించిన విజయమే విజయదశమి

- **ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి**
- **ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**

మానకొండూర్ ప్రతినిధి, అక్టోబర్ 21, :

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి నిలుస్తుందని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. దసరా పండుగను పురస్కరించుకొని తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని రాంలీలా మైదానంలో రాంలీలా కమిటీ చైర్మన్ కుంట రాజేందర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ పొన్నాల సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రావణ దహన కార్యక్రమానికి ఆయన టీఎన్జీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయదశమి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించేందుకు ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, శాంతి, శ్రేయస్సును నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి, అంకిత్ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్స్ ఎండి డాక్టర్ కవ్వంపల్లి అనురాధ,



మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్, వివిధ గ్రామాల సర్పంచులు, రాజకీయ పక్షాల నాయకులు, రాంలీలా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. ఆపదలో ఉన్నప్రతి ఒక్కరికీ ప్రాణదానం

- **రక్తదాతలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపిన బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 21, : బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ పుట్టినరోజును పురస్కరించుకొని, తలసేమియా వ్యాధిగ్రస్తులకు సహాయార్థం పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తలసేమియా సికిల్ సెల్ సొసైటీ సౌజన్యంతో సుభాష్ నగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు డాక్టర్ హుస్సేన్, గుబ్బల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ రక్తదాన శిబిరంలో పాల్గొన్న సుమారు 100 మంది రక్తదాతలను అభినందించి, వారికి



సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ.. నా పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులకు, తలసేమియా సికిల్ సెల్ సొసైటీ సభ్యులకు, స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేసిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ప్రతి ఒక్కరికీ పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. రక్తదానం అనేది ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేయడంతో సమానం. ముఖ్యంగా తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తం ఎంతో అవసరం. ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకొని, తమ ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా రక్తదానం చేయాలి. మనం చేసే చిన్న సహాయం మరొకరి ప్రాణాలను కాపాడుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వంశీ, డాక్టర్ శ్రీనివాస్, వారి బృంద సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.రక్తదానం చేయండి.. ప్రాణదాతలుగా నిలవండి.

ఎమ్మెల్యేకు ఎన్హెచ్ఎం ఉద్యోగుల వినతిపత్రం

- **సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా**
- **జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్**

జగిత్యాల ప్రతినిధి, అక్టోబర్ 21, :

నేషనల్ హెల్త్ మిషన్ ఆరోగ్య విభాగంలో వర్క్ చేస్తున్న డాక్టర్లు, వివిధ క్యాడర్లో పనిచేస్తున్న సిబ్బంది వేతన సవరణ కావాలని, పిఆర్సీలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత పెంచాలని కోరుతూ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ని బుధవారం వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ అనేది ఒకప్పుడు యూపీ ప్రభుత్వ మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు దేశవ్యాప్తంగా ఒక ప్రభుత్వ విధానం ఉండాలని దేశ ప్రజలందరికీ వైద్యం అందాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రారంభించిందని అన్నారు. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం అందించే విషయంలో మీ వంతు సహకారం ఉండాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగస్తులు అందరికీ 1, 2 తేదీలలోనే జీతాలు వస్తున్నాయని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరిగింది వాస్తవం అని అన్నారు. జగిత్యాల నియోజకవర్గంలోనే అత్యధికంగా పల్లె దావకానాలు తీసుకురావడం జరిగిందని తెలిపారు.



ఇప్పుడున్న పరిస్థితులలో ఆర్థిక ఇబ్బందులు ఎంతగా ఉన్నా మీ డిమాండ్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్యలను పరిష్కరించే విషయంలో నా వంతు కృషి చేస్తానని అన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- **మహిళలు అమ్మవారి స్వరూపాలు..**
- **భద్రాచలం గీత ఆశ్రమ పీఠాధిపతి విశ్వాత్మానంద గిరి స్వామీజీ**

దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి) , అక్టోబర్ 21, :

సనాతన ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని భద్రాచలం గీత ఆశ్రమ పీఠాధిపతి విశ్వాత్మానంద గిరి స్వామీజీ పిలుపునిచ్చారు. ఆస్తులు, అంతస్తుల కంటే ధర్మమే గొప్పదని, భావితరాలకు ధర్మ విలువలను అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలో బుధవారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సుహాసిని పూజా కార్యక్రమంలో దళిత మహిళలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ స్వయంగా మహిళల పాదాలను కడిగి, మహిళలు అమ్మవారి స్వరూపాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా విశ్వాత్మానంద గిరి స్వామీజీ మాట్లాడుతూ.. రేపటి సమాజంలో ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఆస్తులు, అంతస్తుల కంటే ధర్మానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ధర్మాన్ని, సంప్రదాయాలను పిల్లలకు నేర్పించి భావితరాలకు అందించాలని, అలా చేయకపోతే సమాజానికి నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత అభియాన్ రాష్ట్ర కన్వీనర్ ధనుంజయ, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి, మల్లయ్య, కుమార్, ఐలయ్య, సత్యం, స్వామి తదితరులు పాల్గొన్నారు.






ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం కాంగ్రెస్ శ్రేణులు సమిష్టి కృషి చేయాలి

- మొదటి ప్రాధాన్యత ఓట్లు తోనే విజయం సాధించాలి
- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

దమ్మపేట, అక్టోబర్ 21, : ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ బుధవారం అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో శ్రీశ్రీ కళ్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచార ప్రణాళిక పట్టభద్రులను కలవడం పార్టీ శ్రేణుల సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి ఖమ్మం లోక్‌సభ సభ్యులు రామ సహాయం రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి, సర్వోత్తమరెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ లు ముఖ్య అతిథులుగా హాజరు అయిన ఈ సమావేశంలో ముఖ్య నాయకులు మాట్లాడుతూ రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సూచించారు. పట్ట భద్రులను కలిసి కాంగ్రెస్ పార్టీ విధానాలను అభ్యర్థి గెలుపు ఆవశ్యకతను వివరించాలని తెలిపారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ శ్రేణులన్నీ ఒకే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పార్టీలో ఎలాంటి వర్గ విభేదాలకు తావివ్వకుండా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, వ్యక్తిగత అభిప్రాయాలను పక్కనపెట్టి పార్టీ అభ్యర్థి గెలుపునకు ప్రాధాన్యత ఇవ్వాలని నాయకులు సూచించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి విధానాలు ప్రచారంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు కార్యకర్తల మధ్య సమన్వయం వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ



బలపరిచిన అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేసి పార్టీ విజయానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజా ప్రతినిధులు,వివిధ మండలాల పార్టీ బాధ్యులు, దమ్మపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కక్కిరాల రమేష్, సీనియర్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు, వనమాల సూరిబాబు, అన్నవరపు నాగేంద్రరావు, సోషల్ మీడియా బాధ్యులు రషీద్, పట్టభద్రులు గట్ల నాగరాజు, పిట్టల శ్రీనివాసరావు కార్యకర్తలు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హన్మంత్ రెడ్డి కి దసరా శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు శ్రవణ్ కుమార్



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 21, : దసరా పండుగను పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హన్మంత్ రెడ్డి ని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దమ్మని శ్రవణ్ కుమార్ దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దమ్మని శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, విజయదశమి పర్వదినాన అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, ప్రతి ఒక్కరి జీవితంలో విజయం, సంతోషం, శాంతి వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కే.ఎం. గౌరీష్, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు ముదిరాజ్, బహదూర్‌పల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్, తెలంగాణ ఉద్యమకారులు, కాంగ్రెస్ నాయకులు, గ్రేటర్ మాజీ సెక్రటరీ గుమ్మడి మధుసూదన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ జన్మదినం సందర్భంగా ప్రత్యేక గీతం విడుదల

- తెలంగాణ మాస్ యాసలో ఆకట్టుకునేలా 'బందోబస్తేలే.. బాడీగార్డులే.. బయలెల్లొచ్చావే వివేకన్నా..' పాట

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 21, : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ శాసనసభాపక్ష విప్ కేపీ వివేకానంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని రూపొందించిన ప్రత్యేక గీతాన్ని బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విడుదల చేశారు.

బందోబస్తేలే.. బాడీగార్డులే.. బయలెల్లొచ్చావే వివేకన్నా.. బాధంటే చాలే.. భయమెయ్యాదాయే.. బలమై వస్తావే వివేకన్నా.. అంటూ సాగే ఈ పాట తెలంగాణ మాస్ యాసలో, స్థానిక భాషా శైలిలో ఆకట్టుకునే



పదాలతో రూపొందింది. ప్రజలకు అండగా నిలిచే నాయకుడిగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌పై అభిమానులు చూపిస్తున్న ఆదరణను, ఆయన పట్ల ఉన్న అభిమానాన్ని ఈ గీతం ప్రతిబింబించేలా ఉంది. ఈ ప్రత్యేక గీతం రూపకల్పనలో భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి కీలక పాత్ర పోషించగా, నల్గొండ గద్దర్ పాటను ఆలపించారు. బుల్లెట్ లక్ష్మణ్ గీతానికి సాహిత్యం అందించారు. తెలంగాణ మట్టి వాసనను ప్రతిబింబించే మాస్ శైలిలో రూపొందిన ఈ పాట, ఎమ్మెల్యే అభిమానులను ఆకట్టుకునేలా సాగింది. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఈ గీతాన్ని విడుదల చేయడంతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. జన్మదిన వేడుకలకు ఈ ప్రత్యేక గీతం మరింత సందడి తీసుకురానుందని నాయకులు, అభిమానులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

- జన్మదినం సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్



హైదరాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 21, : బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ తన జన్మదినం సందర్భంగా బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్‌ను శాలువాతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్‌కు ఆశీస్సులు అందించి, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఈ భేటీ ఆత్మీయ వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, ఇతర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజల పెద్ద పండుగ దసరా

- ప్రజలంతా సుఖసంతోషాలతో, అన్ని రంగాల్లో విజయాలు సాధించాలి: గూడ ఐలయ్య గౌడ్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 21, : తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఎంతో ఇష్టంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకునే అతిపెద్ద పండుగల్లో దసరా ముఖ్యమైనదని రాష్ట్ర ఓబీసీ జాతీయ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు గూడ ఐలయ్య గౌడ్ పేర్కొన్నారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని రోడా మేస్త్రినగర్, మగ్దుం నగర్‌లోని బొడ్రాయి వద్ద మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ దంపతుల ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్రాయి వద్ద నుంచి జమ్మి చెట్టు వరకు ప్రజలు ర్యాలీగా వెళ్లి, సంప్రదాయబద్ధంగా జమ్మి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గూడ ఐలయ్య గౌడ్ మాట్లాడుతూ.. జమ్మి పూజకు హిందూ సంప్రదాయంలో ఎంతో విశిష్టమైన స్థానం ఉందని, విజయానికి ప్రతీకగా జమ్మి చెట్టును పూజించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. మహాభారతంలో పాండవులకు సంబంధించిన జమ్మి వృక్ష సంప్రదాయాన్ని, శ్రీరాముని విజయగాథను స్మరించుకుంటూ విజయదశమి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో రాష్ట్ర ప్రజలందరికీ విజయాలు కలగాలని, తెలంగాణలోని పేద ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజలు విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి తదితర అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. అనంతరం స్థానిక ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ



కార్యక్రమంలో అడ్వకేట్ సాయిపూజ రోహిత్ గౌడ్, దసరా జమ్మి పూజ కమిటీ సభ్యులు గూడ సాయి ప్రవీణ్ గౌడ్, భాస్కర్, ఓరిగంటి విటల్, ప్రభు, యాదగిరి, మంగ, సులోచన, మల్లారెడ్డి, లక్ష్మి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు. దసరా పండుగ సందర్భంగా నిర్వహించిన జమ్మి పూజలు, ర్యాలీతో రోడా మేస్త్రినగర్, మగ్దుం నగర్ ప్రాంతాల్లో పండుగ సందడి నెలకొంది.

విజయదశమి పర్వదినం సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను కలిసిన మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి



హైదరాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 21, : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ని మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ కి విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. దసరా పర్వదినం ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. ధర్మంపై విజయానికి, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పండుగ ప్రతి ఒక్కరికీ నూతనోత్సాహాన్ని, విజయాలను అందించాలని వారు ఆకాంక్షించారు. విజయదశమి శుభాకాంక్షలతో ఆత్మీయంగా సాగిన ఈ మర్యాదపూర్వక భేటీ పండుగ వాతావరణాన్ని ప్రతిబింబించింది.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

- 200 మందికి కంటి పరీక్షలు.. 30 మందికి ఆపరేషన్లకు ఎంపిక

అశ్వారావుపేట ప్రతినిధి, అక్టోబర్ 21, : అశ్వారావుపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక టీవీఎస్ షోరూం, ఆదిత్య చిన్నపిల్లల ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి సుమారు 200 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో కంటి సమస్యలు ఉన్నవారిని గుర్తించి, వారిలో సుమారు 30 మందిని కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. వీరిని అక్టోబర్ 24వ తేదీన వైరాలోని కంటి ఆసుపత్రికి తరలించి ఆపరేషన్లు నిర్వహించేందుకు లయన్స్ క్లబ్ సభ్యులు ఏర్పాట్లు చేశారు. వైరాకు చెందిన కంటి వైద్యులు డాక్టర్ కాప మురళీకృష్ణ, డాక్టర్ రవిచంద్ర



తమ వైద్య బృందంతో కలిసి కంటి పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలను అభినందించిన ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌కు భవిష్యత్తులో మరింత సహకారం అందిస్తాను అని, ప్రజలకు ఉపయోగపడేలా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్‌కు భవిష్యత్తులో అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీపై లయన్స్ క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. పేదలకు ఉచిత కంటి వైద్య సేవలు అందించడం, అవసరమైన వారికి ఆపరేషన్లు చేయించడం వంటి కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని క్లబ్ సభ్యులు తెలిపారు. శిబిరానికి వచ్చిన వారికి భోజన వసతిని కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నరేంద్రబాబు లక్కినేని, కార్యదర్శి బలమూరి సూర్యారావు, కోశాధికారి జూపల్లి బ్రహ్మారావు, యూఎస్ ప్రకాష్ రావు, సీనియర్ లయన్స్ సభ్యులు కోటగిరి మోహన్ రావు, కొఠారి చలపతిరావు, కంచర్ల రామారావు, చీమకుర్తి వెంకటేశ్వరరావు, చీమకుర్తి చక్రం, సుబ్బారావు, చంటిబాబు, పెన్నాడ శ్రీనివాసరావు, కంచర్ల భాస్కరరావు, సమయమంతుల మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు..



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 21, : దసరా పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు, పలువురు ప్రముఖులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును శాలువాలతో సత్కరించి, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ పర్వదినం సందర్భంగా పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంతో శంభీపూర్ కార్యాలయంలో పండుగ సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, కాలనీల ప్రతినిధులతో కార్యాలయం సందడిగా మారింది. దసరా పండుగ అందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, శ్రేయస్సు నింపాలని ఆకాంక్షిస్తూ నాయకులు, కార్యకర్తలు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కు దసరా శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 21, : దసరా పండుగను పురస్కరించుకుని షాపూర్‌నగర్‌లోని నివాస కార్యాలయంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌ను నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ నాయకులు, కార్యకర్తలకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని, అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పండుగ శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు జన్మదిన శుభాకాంక్షలు

తెలిపిన మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 21, : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ఎల్పీ విప్ కేపీ వివేకానంద్ జన్మదిన వేడుకలు బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానుల రాకతో క్యాంపు కార్యాలయం సందడిగా మారింది. పలువురు నాయకులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సంతోష్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.



ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 21, : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, ప్రజా సేవలో నిరంతరం నిమగ్నమై ఉండే నాయకుడు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్ అని జై గౌడ ఉద్యమం రాష్ట్ర అధికార ప్రతినిధి బీసు వెంకటేశం గౌడ్ అన్నారు. "అన్నా అంటే నేనున్నానంటూ ప్రజలకు భరోసా ఇచ్చే నాయకుడు, తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక మెజారిటీ సాధించిన యోధుడు కేపీ వివేకానంద్ గౌడ్" అని ఆయన కొనియాడారు. ప్రజలతో నిరంతరం మమేకమవుతూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే, బీఆర్ఎస్ విప్ కేపీ వివేకానంద్ గౌడ్ ప్రజలకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు జై గౌడ ఉద్యమం రాష్ట్ర అధికార ప్రతినిధి బీసు వెంకటేశం గౌడ్‌తో పాటు భగత్ సింగ్ నగర్ సంక్షేమ సంఘం నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పశ్చిమట్ల నరేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎస్. ప్రతాపరెడ్డి, మాజీ అధ్యక్షుడు చింతల్ అశోక్, మిక్చర్ రాములు, కే. ఎల్లేష్, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

దసరా పర్వదినం సందర్భంగా డాక్టర్ మల్లు రవికి శుభాకాంక్షలు తెలిపిన శేరి సతీష్ రెడ్డి

కూకట్పల్లి ప్రతినిధి, అక్టోబర్ 21, : దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లు రవిని బుధవారం కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు శేరి సతీష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లు రవికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయనతో కొంతసేపు ఆత్మీయంగా ముచ్చటించి, కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లు రవి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ ఆత్మీయ కలయిక తనకు ఎంతో సంతోషాన్ని, సంతృప్తిని కలిగించిందని శేరి సతీష్ రెడ్డి తెలిపారు. పండుగ సందర్భంగా సీనియర్ నాయకుడిని కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన బి సంజీవ్ రావుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



జర్నలిజం నుంచి పాలిటిక్స్ నాయకత్వం వరకు.. లోక రవిచంద్ర ప్రస్థానం..

- మూడు దశాబ్దాల అనుభవం.. సామాజిక సేవలో ప్రత్యేక గుర్తింపు..
- తెలంగాణ రాజకీయాల్లో కీలక పాత్ర
- సిద్దిపేట జిల్లా టీఆర్ఎస్ అధ్యక్షుడిగా నూతన బాధ్యతలు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 21, : జర్నలిజంలో విశేష అనుభవం.. సామాజిక సేవలో అంకితభావం.. రాజకీయ రంగంలో క్రియాశీల పాత్ర.. ఇలా విభిన్న రంగాల్లో తనదైన ముద్ర వేసుకున్న వ్యక్తి లోక రవిచంద్ర. సుమారు మూడు దశాబ్దాల పాటు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో జర్నలిస్టుగా మండల స్థాయి నుంచి ఎడిటర్ స్థాయి వరకు వివిధ హోదాల్లో పనిచేసి అపార అనుభవాన్ని సంపాదించిన ఆయన, తాజాగా తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక బాధ్యతను చేపట్టారు. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నాయకత్వంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా నియమితులై తన రాజకీయ ప్రస్థానంలో మరో ముందడుగు వేశారు.

జర్నలిజంలో మూడు దశాబ్దాల అనుభవం

సమాజంలోని సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, ప్రజల గొంతుకగా నిలవడం జర్నలిజం ప్రధాన లక్ష్యం. ఈ లక్ష్యంతో సుమారు 30 ఏళ్ల పాటు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రంగాల్లో పనిచేసిన లోక రవిచంద్ర, మండల స్థాయి నుంచి ఎడిటర్ స్థాయి వరకు వివిధ బాధ్యతలు నిర్వహించారు. క్షేత్రస్థాయి సమస్యలపై అవగాహన, ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు, పరిపాలనా వ్యవస్థపై అనుభవం ఆయనకు ఈ సుదీర్ఘ జర్నలిస్టు ప్రస్థానం ద్వారా లభించాయి.

సామాజిక సేవలోనూ ముందంజ

జర్నలిజానికే పరిమితం కాకుండా సామాజిక సేవలోనూ లోక రవిచంద్ర తనదైన పాత్ర పోషించారు. సంఘమిత్ర సంక్షేమ సమితి స్వచ్ఛంద సంస్థ ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజం పట్ల తనకున్న బాధ్యతను చాటుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు సామాజిక సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం ఆయన సేవా దృక్పథానికి నిదర్శనంగా నిలిచింది.

బ్రాహ్మణ పరిషత్తు అభివృద్ధికి విశేష కృషి

సిద్దిపేట బ్రాహ్మణ పరిషత్తు అధ్యక్షుడిగా మూడు సంవత్సరాల పాటు బాధ్యతలు నిర్వహించిన లోక రవిచంద్ర, పరిషత్తు అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ముఖ్యంగా బ్రాహ్మణ పరిషత్తు సంక్షేమ సదనం అభివృద్ధికి రూ.75 లక్షల నిధులు మంజూరయ్యేలా కృషి చేయడంలో కీలక పాత్ర పోషించారు. సామాజిక సంస్థల అభివృద్ధి, సమాజ సంక్షేమానికి అవసరమైన వనరుల సమీకరణలో ఆయన చొరవ ప్రత్యేకంగా నిలిచింది.

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి నుంచి రాజకీయ బాధ్యతల వరకు

కల్వకుంట్ల కవిత నాయకత్వంలో తెలంగాణ జాగృతిలో చేరిన లోక రవిచంద్ర, ఆ సంస్థ స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం టీఆర్ఎస్ పార్టీ నిర్మాణం, పార్టీ సిద్ధాంతాల రూపకల్పనలోనూ కీలక పాత్ర పోషించారు. పార్టీ జెండా పండుగ నిర్వహణలో రాష్ట్ర పరిశీలకుడిగా బాధ్యతలు చేపట్టి సంస్థాగత కార్యక్రమాల్లో తన అనుభవాన్ని వినియోగించారు.

సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా నూతన బాధ్యతలు

దీర్ఘకాలిక జర్నలిస్టు అనుభవం, సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం, వివిధ సంస్థల్లో నాయకత్వ బాధ్యతలు నిర్వహించిన అనుభవం నేపథ్యంలో లోక రవిచంద్రకు సిద్దిపేట జిల్లా పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించారు. కల్వకుంట్ల కవిత నాయకత్వంలో తెలంగాణ రక్షణ సేన జిల్లా కమిటీని ప్రకటించిన నేపథ్యంలో ఆయనకు ఈ బాధ్యతలు దక్కాయి. జర్నలిస్టుగా ప్రజల సమస్యలను తెలుసుకున్న అనుభవం.. సామాజిక సేవకుడిగా ప్రజలతో ఏర్పరచుకున్న అనుబంధం.. రాజకీయ నాయకుడిగా సంస్థాగత వ్యవహారాలపై సంపా దించిన అవగాహన.. ఇవన్నీ కొత్త బాధ్యత ల్లో ఆయనకు ఉపయోగపడే అంశాలుగా నిలవను న్నాయి. మొత్తంగా, జర్నలిజం నుంచి సామాజిక సేవ వరకు, అక్కడి నుంచి రాజకీయ నాయకత్వం వరకు సాగిన లోక రవిచంద్ర ప్రస్థానం సిద్దిపేట జిల్లా రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. జిల్లా అధ్యక్షుడిగా ఆయన భవిష్యత్తులో చేపట్టనున్న కార్యక్రమాలు, పార్టీ బలోపేతానికి చేసే కృషి ఎలా ఉండబోతుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

సిద్ధన్నపేటలో విద్యుత్ ప్రమాదం.. స్తంభంపై నుంచి పడిన కార్మికుడు..

- ఫీడర్ నిర్వహణలో పొరపాటే ప్రమాదానికి కారణమా..
- విద్యుత్ శాఖ భద్రతా చర్యలపై గ్రామస్థుల ఆందోళన

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 21, : విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో వస్తాదుల లక్ష్మయ్య విద్యుత్ షాక్‌కు గురై స్తంభంపై నుంచి కింద పడిపోయాడు. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలై రక్తస్రావం కావడంతో స్థానికులు వెంటనే స్పందించి సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం లక్ష్మయ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నంగునూరులోని విద్యుత్ ఉపకేంద్రం నుంచి సిద్దన్నపేట ఫీడర్‌కు లైన్ క్లియర్ (ఎల్‌సీ) తీసుకున్న లక్ష్మయ్య, గ్రామంలో విద్యుత్ స్తంభంపై ఉన్న సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టాడు. ఈ క్రమంలో విద్యుత్ ఉపకేంద్రంలో ఫీడర్ నిర్వహణకు సంబంధించి జరిగిన పొరపాటు కారణంగా సిద్దన్నపేట ఫీడర్‌కు విద్యుత్ సరఫరా అయినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీంతో స్తంభంపై పనిచేస్తున్న లక్ష్మయ్య ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై కిందపడిపోయాడు.

ప్రమాదాన్ని గమనించిన స్థానికులు క్షణం ఆలస్యం చేయకుండా లక్ష్మయ్యను రక్షించేందుకు ముందుకొచ్చారు. తీవ్ర గాయాలతో బాధ పడుతున్న ఆయనను వెంటనే ఆస్పత్రికి తరలించారు. స్థానికులు సకాలంలో స్పందించి వైద్య చికిత్స అందేలా చర్యలు తీసుకోవడంతో ప్రాణాపాయం తప్పినట్లు సమాచారం.

భద్రతా చర్యలపై ప్రశ్నలు

ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు నిరంతరం శ్రమించే విద్యుత్ సిబ్బంది ప్రాణాలకే భద్రత లేకపోతే పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు ఈ ఘటనతో తలెత్తుతున్నాయి. మరమ్మతుల కోసం ఎల్‌సీ తీసుకున్నప్పటికీ విద్యుత్ సరఫరా ఎలా పునరుద్ధరించబడిందన్న అంశంపై గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌సీ విధానాలు, ఫీడర్ నిర్వహణలో సమన్వయం, మరమ్మతులు పూర్తయ్యే వరకు విద్యుత్ సరఫరా నిలిపివేత వంటి భద్రతా చర్యలు సక్రమంగా అమలవుతున్నాయా అనే చర్చ సాగుతోంది. విద్యుత్ సిబ్బంది విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం జరిగినా అది వారి ప్రాణాలకే ముప్పుగా మారే ప్రమాదం ఉంది. అందువల్ల విద్యుత్ శాఖ అధికారులు భద్రతా నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంతోపాటు, ఫీడర్ నిర్వహణలో అప్రమత్తత పాటించాల్సిన అవసరం ఉంది. ఈ ఘటనపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి ప్రమాదానికి గల అసలు కారణాలను గుర్తించాలని, బాధ్యుల నిర్లక్ష్యం నిర్ధారణ అయితే తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



గజ్వేల్‌లో రోడ్డు ప్రమాదం.. యువకుడు మృతి..

- లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 21, : సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. గజ్వేల్ ఏసీపీ నరసింహులు వెల్లడించిన వివరాల ప్రకారం.. శ్రీగిరిపల్లికి చెందిన అనిల్ చారి (19) బుధవారం తన ద్విచక్ర వాహనంపై ప్రజ్ఞాపూర్ నుంచి శ్రీగిరిపల్లి వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సెంట్ మేరీస్ పాఠశాల సమీపంలో ముందుగా వెళ్తున్న లారీని వేగంగా, అజాగ్రత్తగా ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న గజ్వేల్ టౌన్ పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని



బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అనిల్ చారి తీవ్రంగా గాయపడటంతో తొలుత మెరుగైన చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ నరసింహులు తెలిపారు. ప్రమాద సమయంలో యువకుడు మద్యం సేవించి వాహనం నడిపి ఉండవచ్చనే అనుమానంతో వైద్య నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, ల్యాబ్ నివేదిక ఆధారంగా తదుపరి విచారణ కొనసాగిస్తామని తెలిపారు.

వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి

వాహనదారులు ప్రయాణ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అతివేగానికి దూరంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఏసీపీ నరసింహులు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని, తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టవద్దని విజ్ఞప్తి చేశారు.

సదాశివపేటలో ఘనంగా దసరా ఉత్సవాలు

- జమ్మిచెట్టుకు పూజలు.. రావణ దహనంతో సందడి..
- జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి సహకారంతో వేడుకల నిర్వహణ

సదాశివపేట, అక్టోబర్ 21, : సదాశివపేట పట్టణంలోని దుర్గమ్మ మందిరం వద్ద విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ మందిరం నుంచి శోభాయాత్ర చేపట్టారు. అనంతరం దుర్గమ్మ మందిరం వద్ద ఉన్న జమ్మిచెట్టుకు మున్సిపల్ చైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్‌పర్సన్ రేణుక చిరు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పట్లూరి నాగరాజు గౌడ్, కౌన్సిలర్లు, ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణ ప్రజలు జమ్మి ఆకులను ఒకరికొకరు అందజేసుకుంటూ దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా దుర్గమ్మ మందిరం వద్ద ఏర్పాటు చేసిన సభలో ప్రజాప్రతినిధులు దసరా పండుగ ప్రాముఖ్యతను వివరించారు. మరింత ఘనంగా నిర్వహిస్తాం దసరా ఉత్సవాలను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి సహకారంతో నిర్వహించినట్లు చైర్‌పర్సన్ అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్‌పర్సన్ రేణుక చిరు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పట్లూరి నాగరాజు గౌడ్ తెలిపారు. పట్టణ ప్రజలు తమ సలహాలు, సూచనలు అందిస్తే వచ్చే ఏడాది మరింత ఘనంగా దసరా వేడుకలు నిర్వహించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం టపాసుల మోతలు, బాణసంచా వెలుగుల మధ్య రావణుడి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు, పండితులు, పూజారులు, ఆలయ కమిటీ సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- ప్రజల రక్షణ, శాంతిభద్రతలో పోలీసుల సేవలు వెలకట్టలేనివి
- జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్



జగిత్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 21, :

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జగిత్యాల జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి సేవలను కొనియాడారు.విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం ఆవరణ లోని పరేడ్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపం వద్ద జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, పోలీస్ అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ

ప్రజలకు భద్రత కల్పించడం, సమాజంలో శాంతిభద్రతలను కాపాడటం, విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలవడంలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లు ఎదురైనా, కుటుంబాలకు దూరంగా ఉంటూ నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమయ్యే పోలీసు అధికారులు, సిబ్బంది సేవలు అభినందనీయమని తెలిపారు. సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు పోలీసు శాఖ చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అమరవీరుల కుటుంబాలకు సమాజం ఎల్లప్పుడూ అండగా నిలవాలని పేర్కొన్నారు.

జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ

దేశ రక్షణ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధులు నిర్వహిస్తూ ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. విధి నిర్వహణలో ధైర్యం, క్రమశిక్షణ, అంకితభావం, నిబద్ధతతో పనిచేయడం ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది కర్తవ్యమని తెలిపారు. పోలీసు శాఖపై ప్రజలకు నమ్మకం మరింత పెరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని తెలిపారు. కార్యక్రమము అనంతరం పోలీసు కుటుంబ సభ్యులకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, డిఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు, రవికుమార్, సిఐలు ఎస్ఐలు, పోలీస్ అమర వీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా పోలీసులకు ఘన సన్మానం

- జగద్గిరిగుట్ట ఎస్ఐ శ్రీనివాస్‌తో పాటు సిబ్బందికి శాలువాలతో సత్కారం

కూకట్పల్లి ప్రతినిధి, అక్టోబర్ 21, :

పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీనివాస్ వారి సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పోలీస్ అమరవీరుల దినోత్సవంతో పాటు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలు సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ప్రజల భద్రత కోసం అహర్నిశలు విధులు నిర్వహిస్తున్న పోలీసుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించి గౌరవించాలని ఆకాంక్షించారు.అనంతరం ఎస్ఐ శ్రీనివాస్‌తో పాటు పోలీస్ సిబ్బందికి దసరా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కట్టా శ్రీనివాస్, వెంకట్, శ్రీను, ఆల్విన్ కాలనీ ఫేజ్-2 కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది
- సీపీ సాధన రష్మీ పెరుమాళ్
- ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 21, :

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా బుధవారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సంస్మరణ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విధి నిర్వహణలో దేశ రక్షణ, ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులకు సీపీతో పాటు పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ సాధన రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ పోలీస్ శాఖ నిరంతరం 24 గంటల పాటు ప్రజల రక్షణ కోసం పనిచేసే విభాగమని, పండుగలు, సెలవులు అనే తేడా లేకుండా పోలీసులు విధులు నిర్వహిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నారని తెలిపారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ వద్ద జరిగిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల త్యాగాలకు గుర్తుగా ప్రతి



సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల కుటుంబాలు చేసిన త్యాగాలను, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పోలీస్ శాఖ ఎప్పటికీ మరచిపోదని స్పష్టం చేశారు. అమరవీరుల కుటుంబాలకు ఏవైనా సమస్యలు ఎదురైతే నేరుగా సంప్రదించాలని, సిద్దిపేట పోలీస్ కమిషనర్‌గా తాను, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి పోలీస్ శాఖ కట్టుబడి ఉంటుందని తెలిపారు. కార్యక్రమానికి హాజరైన అమరవీరుల కుటుంబ సభ్యులతో సీపీ ప్రత్యేకంగా మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు విన్నవించిన సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.



సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో ఏడుగురు పోలీసుల అమరత్వం

అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్ మాట్లాడుతూ సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు విధి నిర్వహణలో ఏడుగురు పోలీస్ అధికారులు, సిబ్బంది అమరులయ్యారని తెలిపారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన 154 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది పేర్లను చదివి వినిపించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పోలీసుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని, వారి సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్, అదనపు డీసీపీ (ఏఆర్) సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ డివిజన్‌లో పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు



- పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్పల్లిప్రతినిధి,అక్టోబర్ 21, :

కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని పలు దేవాలయాల్లో బుధవారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురా రోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద భక్తులతో మాట్లాడిన ఎమ్మెల్యే, ప్రజలందరికీ దైవానుగ్రహం కలగాలని కోరుకున్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదు

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రమేష్
- విద్యార్థిని వర్షిణికి బండి రమేష్ సేవా సంస్థ ద్వారా రూ.15వేలు ఆర్థిక సహాయం

కూకట్పల్లి ప్రతినిధి, అక్టోబర్ 21, :

ఆర్థిక ఇబ్బందులతో విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకూడదనే లక్ష్యంతో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ తన సేవా సంస్థ ద్వారా విద్యార్థులకు అండగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగా బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని డి వర్షిణికి కళాశాల విద్య కోసం రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బుధవారం కూకట్‌పల్లిలోని హేమ దుర్గా భవన్‌లో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈ ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో తన సేవా సంస్థ ద్వారా అవసరమైన వారికి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. విద్య అనేది ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపే గొప్ప ఆయుధమని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, పట్టుదలతో చదివి తమ తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడం, విద్యార్థుల విద్యాభ్యాసానికి తోడ్పడటం తన బాధ్యతగా భావిస్తున్నానని ఆయన తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మయ్య, కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు కావేటి



నాగార్జున, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాజేష్ గౌడ్, నరసింహ యాదవ్, ముస్తఫా, రమణ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల చదువుకు ఆర్థిక చేయూతనిస్తూ, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడమే లక్ష్యంగా బండి రమేష్ సేవా సంస్థ చేపడుతున్న కార్యక్రమాలపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కేసీఆర్‌కు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్పల్లి ప్రతినిధి, అక్టోబర్ 21, :

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయదశమి పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యాలను నింపాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఐకమత్యంతో ముందుకు సాగాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా పండుగ శుభాకాంక్షలతో పాటు పరస్పర మర్యాదపూర్వక పలకరింపులతో ఆత్మీయ వాతావరణం నెలకొంది.



చిల్కానగర్ సీనియర్ సిటిజన్స్ నూతన కార్యాలయం ప్రారంభం

- వృద్ధుల కోసం వెయ్యి గజాల స్థలం కేటాయించాలి
- కేబీఆర్ పార్క్ తరహాలో భారీ పార్కు ఏర్పాటు చేయాలి

చిల్కానగర్, అక్టోబర్ 21, :

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని చిల్కానగర్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి 108 మంది సభ్యులు హాజరై విజయవంతం చేశారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర నాయకులు వెంకటయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ప్రేమ్ కుమార్ గౌడ్, ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేసి నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మగాని దాసు గౌడ్ మాట్లాడుతూ, చిల్కానగర్ ప్రాంతంలో సీనియర్



సిటిజన్స్ సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. వృద్ధుల కోసం శాశ్వత సంఘ భవనం, డే కేర్ సెంటర్, గ్రంథాలయం, యోగా కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం వెయ్యి గజాల స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రోజురోజుకూ వృద్ధుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఇటువంటి సదుపాయాలు అత్యవసరమనిపేర్కొన్నారు.అలాగే ఉప్పల్, మల్లాపూర్, నాచారం, చిల్కానగర్ ప్రాంతాల్లో జనసాంద్రతతో పాటు వాయు కాలుష్యం కూడా పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులు, చిన్నారులు ప్రశాంత వాతావరణంలో స్వచ్ఛమైన గాలిని పీల్చుకునేందుకు తగిన పార్కులు అందుబాటులో లేవని తెలిపారు. ప్రభుత్వం మూతపడిన అనారోగ్య పరిశ్రమల (సిక్ ఇండస్ట్రీస్) భూములను తిరిగి స్వాధీనం చేసుకుని, హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్క్ తరహాలో ఈ ప్రాంతంలో భారీ పార్కును ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి, స్థానిక ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు.పండుగ పనుల బిజీలోనూ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేసిన 108 మంది సభ్యులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సలహాదారులు, కార్యవర్గ సభ్యులు, పాలకవర్గ సభ్యులు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.


దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్సీ కి శాలువాలతో సన్మానం



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 21, : దసరా పండుగను పురస్కరించుకుని బుధవారం మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు ని భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి శాలువా కప్పి ఘనంగా సన్మానించి, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పోలీస్ గోవింద్ రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అరేకపూడి గాంధీకి దసరా శుభాకాంక్షలు

- మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, రామకృష్ణ గౌడ్



కూకట్పల్లి ప్రతినిధి, అక్టోబర్ 21, : విజయదశమి పర్వదినం శుభసందర్భంగా శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పీఏసీ చైర్మన్ అరేకపూడి గాంధీ ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ దసరా పండుగ శుభాకాంక్షల తెలియజేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ విజయదశమి శుభం చేకూర్చాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్ తో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఐ సురేష్ కు దసరా శుభాకాంక్షలు తెలిపిన దొడ్ల వెంకటేష్ గౌడ్, యువనేత రామకృష్ణ గౌడ్



కూకట్పల్లి ప్రతినిధి, అక్టోబర్ 21, : విజయదశమి పర్వదిన శుభసందర్భాన్ని పురస్కరించుకొని ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ బుధవారం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ సీఐ సురేష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో సీఐ సురేష్‌ను కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. డివిజన్ లోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు శివరాజ్ గౌడ్, పోశెట్టిగౌడ్, సంతోష్ బిరాదర్, అభిగౌడ్, నాగరాజు, ఖలీమ్ తదితరులు పాల్గొని సీఐకి శుభాకాంక్షలు అందజేశారు.

దసరా నవరాత్రి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నేత రెడ్డి సతీష్ అరోరా



కూకట్పల్లి ప్రతినిధి, అక్టోబర్ 21, : బాలాజీ నగర్ డివిజన్ 15వ ఫేజ్ అసోసియేషన్ సభ్యులు దసరా నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బుధవారం ఆయన అమ్మవారి పూజా కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం రెడ్డి సతీష్ అరోరా మాట్లాడుతూ, దసరా నవరాత్రుల పర్వదినం సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, సమాజంలో సంతోషం, ఐక్యత, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండవ రాధే శ్యామ్, పాతూరు గోపి, రాజేష్ రాయ్, వెంకట్ రెడ్డితో పాటు 15వ ఫేజ్ కాలనీ అసోసియేషన్ సభ్యులు వెంకట్ రాజు, జీవా, శ్రీనివాస్, ప్రవీణ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధ ధర్మంతోనే ప్రపంచ శాంతి

- అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుపాక ఎల్లయ్య

హనుమకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 21, :

స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, మానవీయ విలువలు కలిగిన బౌద్ధ ధర్మం పాటించడం వల్లనే ప్రపంచ శాంతి నెలకొంటుందని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుపాక ఎల్లయ్య అన్నారు. అశోక విజయ దశమి పురస్కరించుకొని మంగళవారం హనుమకొండ జిల్లా కేంద్రం అంబేద్కర్ సెంటర్ లోని బౌద్ధ ఆరామం వద్ద జరిగిన అశోక విజయ దశమి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో అమితమైన కోరికల ద్వారా మనుషులకు దుఃఖం సంభవిస్తుందని దుఃఖ నివారణకు అమితమైన కోరికలు తగ్గించుకోవడంతో పాటు మానవీయ విలువలతో, కరుణతో సాటి మనుషులను సమానత్వంగా చూసిన నాడే మానవ సమాజం మనుగడ సాధిస్తుందని మూడు వేల ఏండ్ల క్రితమే గౌతమ బుద్ధుడు బోధించాడని, బౌద్ధ ధర్మాన్ని పాటిస్తున్న చాలా దేశాలు శాంతియుత జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. బౌద్ధం పుట్టిన భారత ఉప ఖండంలో బౌద్ధ ధర్మాన్ని, వాస్తవాలను నాశనం చేసి మనుధర్మ పాలన కొనసాగుతుందని అందువల్లనే సకల అసమానతలతో, కులాల కుళ్లుతో, మత ఘర్షణలతో భారత సమాజం నష్ట పోతుందని అన్నారు. మానవీయ విలువలకు ప్రతి రూపమైన బౌద్ధ ధర్మాన్ని ప్రతి ఒక్కరూ స్వీకరించి పాటించిన నాడు దేశంలో సమసమాజం ఏర్పడుతుందని ఆయన అన్నారు.

సత్యాన్ని దాచి దసరా పండుగ

ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ మాట్లాడుతూ కళింగ యుద్ధంలో విజయం సాధించిన అశోకుడు ఆ యుద్ధ సమయంలో పారిన నెత్తురు, తెగిన నరఖాంటాలను చూసి చలించి పోయి తీవ్ర ఆవేదనతో ఉన్న తనను తన సహచరి బౌద్ధ భిక్షువు వద్దకు తీసుకెళ్లిందని, ఆ బౌద్ధ భిక్షువు చేసిన బౌద్ధ ధర్మ బోధన, అహింస, కరుణ ద్వారానే శాంతిని నెలకొల్పవచ్చని, బౌద్ధ ధర్మాన్ని పాటించడం ద్వారానే స్వేచ్ఛ, సమానత్వం నెలకొంటుందని జ్ఞానోదయం చెందిన అశోకుడు దశమినాడు తన ఆయుధాన్ని వదలి ఆరోజు నిజమైన విజయంగా ప్రకటించుకున్నాడని, ఆనాటి నుండి ప్రతి సంవత్సరం అక్టోబర్ నెలలో దశమి నాడు విజయ దశమి జరుపుకోవడం భారత ఉపఖండంలో కొనసాగుతుందని అన్నారు. విలువలకు, శాంతికి, కరుణకు ప్రతిరూపమైన విజయ దశమి పండుగను ప్రజల నుండి దూరం చేయడానికే భారత దేశానికి వలస వచ్చిన ఆర్య బాపండ్లు అదే దశమి రోజు దసరా పండుగను తీసుకొచ్చి ప్రజల చేత తప్పుడు పండుగను చేయిస్తున్నారని అన్నారు. యుద్ధం ద్వారా శాంతి రాదని, యుద్ధం ద్వారా విజయం సిద్ధించదని, శాంతి ద్వారా, ప్రేమ, ఆప్యాయతల ద్వారా, స్నేహం, సమానత్వం, సౌభ్రాతృత్వం ద్వారానే శాంతిని నెలకొల్పాగలగుతామని అశోకుడు బౌద్ధ ధర్మాన్ని స్వీకరించిన రోజు



నిజమైన విజయ దశమని, అదే దశమి రోజున అక్టోబర్ 14, 1956 నాడు నాగపూర్ లోని దీక్ష భూమిలో ఆరు లక్షల మందితో అంబేద్కర్ బౌద్ధ ధర్మాన్ని స్వీకరించారని అన్నారు. ఆ బౌద్ధ ధర్మంలోని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతుత్వాన్ని మన రాజ్యాంగంలో కూడా పొందుపరచారని అన్నారు. కానీ గత 3 వేల ఏండ్ల క్రితం భారత దేశంలో చొరబడిన ఆర్య బాపండ్లు పుక్కిటి పురాణాలు, కట్టు కథల పండుగలను మన ముందుకు తెచ్చి మన పూర్వీకులను చంపిన రోజునే మన చేత పండుగలను చేపిస్తున్నారన్నారు. అసలైన చరిత్ర కనుమరుగు చేయడానికే ఇలాంటి పండుగలను మన ముందుకు తెచ్చారనే సత్యాన్ని మనం తెలుసుకోవాలనేదే నా భావనని అన్నారు. దుర్గాదేవి మహిషాసురుడిని చంపిన రోజు, రావణాసురుడిని వధించే రామాయణం, మహాభారతంలోని పాండవులు, జమ్మి చెట్టు, ఆయుధాలు ఇవన్నీ ఒక దానికి ఒకటి సంబంధం లేని వివిధ కాలాలకు చెందిన పుక్కిటి పురాణాలని అన్నారు. ఆయుధ పూజ చేసి ఆయుధంతో సాటి మనుషులను సంహరిద్దామా శాంతి పూజ చేసి మనుషులను ప్రేమిద్దామా ప్రజలే తేల్చుకోవాలని అన్నారు. అశోకుడిని, బౌద్ధ ధర్మాన్ని, అంబేద్కర్ రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే ప్రజాస్వామ్యం వర్ధిల్లి సమసమాజం ఏర్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకురాలు జన్ను పద్మ, మాదిగ జాంబవ జాగృతి సంగం నాయకులు బొల్లె సాంబయ్య, షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఏనుట్ల రవీందర్, ఉపాధ్యక్షులు ఎర్ర శోభన్ బాబు, ప్రధాన కార్యదర్శి బంగారు బాబు, డివిస్పి నాయకులు మేకల సుమన్, సురేష్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు బూజు గుండ్ల శ్రీనివాస్, జిల్లా కోశాధికారి మంత్రి చాణిక్య, వివిధ సంఘాల నాయకులు బీరం రాము, దేవరాజుగట్టు శ్రీనివాస్, భరత్, మాయవతి, ప్రసాద్, ప్రకాష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కోనాయిపల్లి దళితులపై దాడి చేసిన సర్పంచ్, అనుచరులను అరెస్ట్ చేయాలి

- డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి డిమాండ్.

గజ్వేల్ ప్రతినిధి, అక్టోబర్ 21, :

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పీటీ కోనాయిపల్లిలో బతుకమ్మ పండుగ సందర్భంగా దళితులపై దాడికి పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న గ్రామ సర్పంచ్ మన్నే కళ్యాణ్‌తో పాటు ఆయన అనుచరులను తక్షణమే అరెస్ట్ చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ దప్పులు కొట్టేందుకు కనీస వేతనం అడిగినందుకు మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారిపై దాడి జరగడం దారుణమన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు సమగ్ర విచారణ జరిపి, గాయాల



వివరాలను నమోదు చేసి, ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులకు వైద్యం, రక్షణ కల్పించి, దర్యాప్తును నిష్పక్షపాతంగా నిర్వహించాలని పోలీసు ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. దళితులపై దాడులకు పాల్పడిన వారిని రాజకీయ ఒత్తిళ్లతో కాపాడే ప్రయత్నాలను సహించబోమని, బాధితులకు న్యాయం చేయకపోతే దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని దాసరి ఏగొండ స్వామి హెచ్చరించారు. కోనాయిపల్లి ఘటనకు నిరసనగా మెదక్ కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాలో ప్రజాస్వామికవాదులు, దళిత సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు నర్సింలు, యాదగిరి, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దసరా సెలవులు

- రేపు పునఃప్రారంభం కానున్న పాఠశాలలు

హైదరాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 21, :

తెలంగాణలోని పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన సుదీర్ఘమైన దసరా పండుగ సెలవులు ముగింపు దశకు వచ్చాయి. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 22తో ఈ వేకేషన్ అధికారికంగా పూర్తి కానుంది. దీంతో అక్టోబర్ 23 (శుక్రవారం) నుండి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు మళ్లీ క్లాసులకు హాజరు కావాల్సి ఉంటుంది. పండుగ కోసం సొంత ఊళ్లకు, నగరాల నుండి గ్రామాలకు వెళ్లిన కుటుంబాలు తిరిగి హైదరాబాద్ ప్రయాణమవుతున్నాయి. దీనివల్ల బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు రిటర్న్ ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. ప్రయాణికుల రద్దీని తట్టుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ముఖ్యంగా విజయవాడ, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ రూట్లలో అదనపు సర్వీసులను అందుబాటులోకి తెచ్చింది. రైల్వే శాఖ కూడా దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. హైదరాబాద్ ప్రవేశ మార్గాలైన ఉప్పల్, ఎల్బీ నగర్, కూకట్పల్లి టోల్ప్లాజాల వద్ద వాహనాల రద్దీ పెరిగే అవకాశం ఉండటంతో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. సెలవులు ముగియడంతో పాఠశాలల యాజమాన్యాలు కూడా విద్యాబోధనకు అవసరమైన



ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. రాబోయే రోజుల్లో బతుకమ్మ, దసరా సెలవుల వల్ల జరిగిన సిలబస్ లోటును భర్తీ చేసేందుకు వీలుగా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాలు తెలిపాయి.

ప్రజల ఆరోగ్యం, మరణాలపై ప్రభుత్వం విచారణ చేపట్టాలి

జవహర్ నగర్, అక్టోబర్ 21, : జవహర్నగర్ రాంకీ డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితులు, వరుసగా సంభవిస్తున్న మరణాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న దుర్వాసన, విషవాయువుల కారణంగానే మరణాలు సంభవిస్తున్నాయనే అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఈ ఆరోపణలపై శాస్త్రీయంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. కీసర సర్కిల్ పరిధిలోని జవహర్నగర్ జీహెచ్ఎంసీ ప్రాంతం, ఈస్ట్ నందమూరి నగర్, గబ్బిలాలపేటకు చెందిన మహ్మద్ సలీం (40) మంగళవారం తెల్లవారుజామున శ్వాస తీసుకోవడంలో ఇబ్బందితో మృతిచెందినట్లు షేక్ షావలి, జేఏసీ కన్వీనర్లు మహ్మద్ జావేద్, వైఎస్సార్ నగర్కు చెందిన శారద పేర్కొన్నారు. బుధవారం మృతుడి కుటుంబానికి సంతాపం తెలిపారు. సలీం మృతికి డంపింగ్ యార్డు నుంచి వెలువడే వాయువులే కారణమా అనే అంశంపై అధికారిక విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇటీవల వరుసగా సంభవిస్తున్న మరణాలపై డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల ప్రజలకు అనేక సందేహాలు, అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని గుర్తుచేశారు. అంబేద్కర్ నగర్ చెందిన డి.అరుణ, గబ్బిలాలపేట గాదరి సోమయ్య, వైయస్సార్ నగర్ బొల్లం క్రిష్ణ లాంటివారు శ్వాస సంభందింత సమస్యలతో కన్నుమూశారని ఆరోపించారు. మృతుడు సలీంకు ఎలాంటి చెడు అలవాట్లు లేవని, వ్యాపారం చేసుకుంటూ భార్య, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. సుమారు రెండు సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం గద్వాల జిల్లా, గట్టు మండలం, గొల్లపల్లి గ్రామం (గొర్లకాం) నుంచి జవహర్ నగర్ ప్రాంతానికి వలస వచ్చి స్థిరపడ్డాడని అన్నారు. గత రెండు, మూడు నెలలుగా రాంకీ డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న తీవ్ర దుర్వాసన, అర్ధరాత్రి పూట వెలువడే విష వాయువులు, పొగలతో ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉందని, భరించలేని దుర్గంధంతో రాత్రంతా ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని స్థానిక ప్రజలు, కుటుంబ సభ్యులు వాపోయారని అన్నారు. ప్రజల నుంచి సందేహాలు, అనుమానాలు వ్యక్తమవుతున్న క్రమంలో ప్రజా ఆరోగ్యం, వరుసగా సంభవిస్తున్న అసహజ మరణాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే విచారణ చేపట్టాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా రాంకీ చెత్త డంపింగ్ యార్డును జవహర్ నగర్ ప్రాంతం నుంచి శాశ్వతంగా తొలగించే చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని డిమాండ్ చేశారు.



కల్తీల పదార్థాలను ఇలా గుర్తించండి

ప్రస్తుతం మనం తినే ఆహారంలో ఏది నాణ్యమైందో.. ఏదీ కల్తీ చేశారో గుర్తించడం చాలా కష్టంగా మారింది. ప్రజలు తీసుకునే ఆహార పదార్థాలకు భద్రత లేకుండా పోయింది. సురక్షితమైన ఆహార పదార్థాల గురించి ప్రజలకు అవగాహన చాలా అవసరం. కాబట్టి ఈ సందర్భంగా కల్తీ ఆహారాన్ని ఎలా గుర్తించాలో తెలుసుకుందాం.

అంతా కల్తీ మయం...

ఈ రోజుల్లో మార్కెట్‌లో అనేక ఆహార పదార్థాలు పండ్లు, ధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, పాలు వంటివి విపరీతంగా కల్తీ జరుగుతోంది. వివిధ రకాల రసాయనాలను ఉపయోగించి పండ్లు, కూరగాయలను పండిస్తున్నారు. కల్తీ ఆహార పదార్థాలను తీసుకోవడం ఆరోగ్యానికి చాలా హానికరం, వాటి నిరంతర వినియోగం వాంతులు, విరేచనాలు, కాలేయం,మూత్రపిండాలతో సహా కడుపు సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. కాబట్టి ఈ సమస్యలకు దూరంగా ఉండాలంటే ఒరిజినల్ ఏవి? కల్తీవి ఏవి? అనేవి గుర్తించాలి. అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం..

పాలు

పాలను నీటితో కల్తీ చేయడమే కాకుండా, దానిని చిక్కగా చేయడానికి దాని పరిమాణాన్ని పెంచడానికి డిటర్జెంట్లు, సింథటిక్ పాలు కూడా కలుపుతారు. కాబట్టి దానిని గుర్తించడానికి, 1/2 కప్పు పాలను 1/2 కప్పు నీటితో కలపండి. అందులో నురుగు వస్తే అది డిటర్జెంట్ కలిపిన పాలు అని గుర్తించాలి. సింథటిక్ పాలను గుర్తించడానికి, పాలను వేళ్ల మధ్య రుద్దినప్పుడు, అది సబ్బులా అనిపిస్తుంది.

పసుపు

ఒక గ్లాసు నీరు తీసుకోండి. నీటిలో కొంచెం పసుపు కలపండి. పసుపు కల్తీ అయితే నీటి రంగు పసుపు రంగులోకి మారుతుంది. పసుపు గ్లాసు కిందికి వెళుతుంది. కల్తీ పసుపు ఉన్న నీరు మరింత పసుపు రంగులో కనిపిస్తుంది.

పండ్లు

చాలా వరకు కల్తీ పండ్లు, కూరగాయలలో ముఖ్యంగా ఆపిల్స్ లో జరుగుతుంది. మరింత మెరిసేలా చేయడానికి, దానిపై మైనపు పొరను అప్లై చేస్తున్నారు. కాబట్టి దీన్ని ఎలా గుర్తించాలంటే..? యాపిల్ పైన కత్తితో తేలికగా గీయండి. అప్పుడు మైనపు పొర ఉందో లేదో సులువుగా తెలుస్తుంది.

మిరియాలు..

మిరియాల్లో కూడా బొప్పాయి గింజలు కలిపి కల్తీ చేస్తున్నారు. కాబట్టి దీన్ని పరీక్షించడానికి, ఒక గ్లాసులో నీటిని తీసుకుని, అందులో మిరియాలు వేయండి. మూడు నాలుగు నిమిషాల తర్వాత అందులో బొప్పాయి గింజలు ఉంటే నీటిపై తేలి కనిపిస్తాయి.

నెయ్యి

బంగాళ దుంప, శుద్ధి చేసిన నూనెను దేశీ నెయ్యిలో కలపడం ద్వారా కల్తీకి పాల్పడుతున్నారు. ఐతే దాన్ని గుర్తించడానికి, నెయ్యిలో కొద్దిగా అయోడిన్ ద్రావణాన్ని కలపండి. దాని రంగు నీలం రంగులోకి మారితే, నెయ్యిలో పిండి పదార్థం కలపినట్లు గుర్తించాలి.

మిరపపొడి

ఒరిజినల్ ఎర్ర మిరపకాయ పొడిని గుర్తించడానికి, మిరప పొడిని నీటిలో వేయండి. ఒకవేళ ఎర్ర మిరప పొడి నీటిలో తేలితే అది స్వచ్ఛమైనది. మునిగిపోతే అది కల్తీ అయినట్లు గుర్తించాలి.

ఇంగువ

నెయ్యి లేదా నూనె కలిపినప్పుడు నకిలీ ఇంగువ రంగు లేత ఎరుపు రంగులోకి మారకపోతే అది నకిలీది. నిజమైన ఇంగువను కాల్చినప్పుడు, అది సులభంగా మంటలను అంటుకుంటుంది, అయితే కల్తీ ఇంగువ త్వరగా మంటలను అంటుకోదు.

తేనె

నీటి సహాయంతో తేనె నిజమైనదా? నకిలీదా? అనేది గుర్తించవచ్చు. ఒక గ్లాసు నీటిలో ఒక చెంచా తేనె కలపండి. అది నీటిలో కిందికి చేరితే అది స్వచ్ఛమైనది. అలా కాకుండా నీటిలో కరిగితే అది నకిలీ. తేనెను వైట్ కలర్ క్లాత్ పై వేస్తే అది పీల్చుకోదు. అంతేకాదు దానిపై మరకలు కూడా అంటవు. ఒకవేళ నకిలీ తేనె ఐతే మరకలు అవుతాయి. క్లాత్ లోపలికి పీల్చుకుంటుంది.

పిల్లలకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్.. నేర్పిస్తున్నారా?



మన దేశంలో చంటి పిల్లల నుంచి వృద్ధుల వరకు ఆడవాళ్లకు రక్షణ లేకుండా పోతోంది. కొన్ని సంఘటనల్లో మైనర్ బాలురపై కూడా అత్యాచారాలు జరుగుతున్నాయి. దీనిపై ఎంత మౌనంగా ఉంటే అంత ప్రమాదం. పిల్లలకు మంచి ఏదో.. చెడు ఏదో చెప్పాల్సిన తల్లిదండ్రులే... పట్టించుకోవడం లేదు. ఒక వ్యక్తి ఏ ఉద్దేశ్యంతో తాకుతున్నాడో పిల్లలు ముందే గ్రహిస్తే సగం ప్రమాదాలను అడ్డుకోవచ్చు. కానీ తల్లిదండ్రులు ఏ టచ్ ఎలాంటిదో.. ఎవరిని దగ్గరగా రానివ్వకూడదో.. ఎవరూ ఎక్కడ తాకకూడదో చెప్పడానికి సంకోచిస్తున్నారు. ఈ ధోరణిని త్వరగా వీడి.. పిల్లలకు ఏది మంచో, ఏది చెడో వివరించాలి అంటున్నారు నిపుణులు.

పిల్లల కిడ్నాప్‌లు, వారిపై వేధింపులు, లైంగికవేధింపులు జరుగుతున్న కేసులను మనం ఎప్పటికప్పుడూ చూస్తూనే ఉంటున్నాం. అయినా సరే కొందరు తల్లిదండ్రులు పిల్లలకు కొన్ని సెన్సిటివ్ విషయాలు నేర్పేందుకు ఇబ్బంది పడుతున్నారు. పిల్లలకు ఆ విషయాలపై అవగాహన లేకుంటే ఇలాంటి దారుణాలు జరుగుతూనే ఉంటాయి అంటున్నారు నిపుణులు. కాబట్టి తమ పిల్లలను కాపాడుకోవాలనుకునేవారు.. కొన్ని విషయాలు పిల్లలతో చర్చించాలి. ఆలస్యం కాకముందే వారికి మంచి స్పర్శ, చెడు స్పర్శ వంటి వాటిపై అవగాహన కల్పించాలి. పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కోసం ఈ పద్ధతులు పాటించండి.

సరైన పదాలను ఉపయోగించండి...

కొంతమంది తల్లిదండ్రులు శరీర భాగాలకు.. ప్రత్యేకించి ప్రైవేట్ భాగాలకు వేర్వేరు మారుపేర్లను ఉపయోగిస్తారు. అయితే ప్రతి శరీర భాగానికి సరైన పదాలను ఉపయోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలు తమ తల్లిదండ్రులు శరీరం గురించి మాట్లాడేప్పుడు విచిత్రంగా భావిస్తే.. అది సిగ్గుపడాల్సిన విషయమని పిల్లలు అభిప్రాయపడుతున్నారు. వారి శరీర భాగాల గురించి సరైన పేర్లను చెప్పడం వలన వాటి గురించి సరిగా కమ్యూనికేట్ చేయగలుగుతారు.

సంభాషణలు ఆపొద్దు...

మీ పిల్లలు చాలా చిన్నవారని, ఆ విషయాలు వారిని భయపెడతాయని ఆ సంభాషణను అక్కడ ఆపేయొద్దు. పిల్లలు ఎదుటి వారి ముందు సిల్లీగా అనిపించే జోక్స్ వేస్తూ ఉంటారు. కానీ మీరు నవ్వకుండా, తిట్టకుండా ఉండటం చాలా ముఖ్యం. వారి ప్రశ్నలకు సరైన సమాధానం ఇస్తూ.. వారిని కొన్ని విషయాల పట్ల ఎడ్యుకేట్ చేయడం చాలా ముఖ్యం. సంభాషణలకు మార్గనిర్దేశం చేయడంలో సహాయం కోసం పుస్తకాలను ఉపయోగించండి. లేదా టీచర్స్ లేదా శిశు వైద్యులను సంప్రదించండి.

శరీర భద్రత గురించి..

కారులో సీటు బెల్ట్‌ను పెట్టుకునేటప్పుడు, ఆరోగ్యకరమైన ఆహారం తింటున్నప్పుడు లేదా వీధి దాటడానికి చేతులు పట్టుకున్నప్పుడు దాని గురించి వారికి చెప్పండి. ప్రతి సందర్భంలోనూ వారికి కొన్ని విషయాలు నేర్పించండి. తద్వారా వారు వారి శరీరం విలువను అర్థం చేసుకుంటారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా వారిని బాధపెట్టినప్పుడు గట్టిగా, మర్యాదగా మాట్లాడటాలని చెప్పండి.

అసౌకర్యాన్ని గుర్తించండి...

మన శరీరానికి మనమే యజమాని అని.. పిల్లలకు నేర్పండి. పిల్లలకు ఈ విషయాలు నేర్పడంతో పాటు.. సామాజిక నైపుణ్యాలను సమతుల్యం చేయడం మీకు సవాల్ గా ఉండవచ్చు. కానీ ఇవన్నీ మీరు కచ్చితంగా పిల్లలకు నేర్పాలి. పిల్లలు తమ శరీరం ఎవరి నియంత్రణలోకి వెళ్లకుండా ఇది సహాయపడుతుంది. వీటిని బలవంతంగా కాకుండా.. ప్రేమగా, సున్నితంగా నేర్పించే ప్రయత్నం చేయండి. వివిధ కారణాల వల్ల పిల్లలు వివిధ సమయాల్లో అసౌకర్యానికి గురవుతారు. వారి అసౌకర్యాలను తల్లిదండ్రులు గుర్తించడం చాలా ముఖ్యం. దానికి కారణాలు కూడా తెలుసుకోవాలి.

తాకడం గురించి మాట్లాడండి..

పిల్లలకు మంచి, చెడు టచ్‌ల గురించి చెప్పండి. వీపుపై తట్టడం వంటి సురక్షితమైన స్పర్శలు లేదా కౌగిలింతలు మృదువుగా అనిపిస్తాయి. కొట్టడం లేదా ఇతర భాగాలు పట్టుకోవడం వంటి అసురక్షిత స్పర్శలు పిల్లల శరీరం లేదా భావాలను దెబ్బతీస్తాయి. చెడు స్పర్శలు గురించి చెప్తున్నప్పుడు మీకు భయంగా లేదా అసహ్యంగా అనిపించవచ్చు కానీ.. అవే వారిని కొన్ని సందర్భాల నుంచి రక్షిస్తాయని గుర్తించుకోండి. కుటుంబ సభ్యులు లేదా స్నేహితులకు నో చెప్పడం లేదా తిరస్కరించడానికి పిల్లలకు తగినంత అధికారం ఇవ్వాలి. వాళ్లకు నచ్చని విషయాన్ని వారు నిర్మొహమాటంగా తిరస్కరించే ధైర్యాన్ని ఇవ్వండి.



పని ఒత్తిడి నుంచి ఇలా బయటపడండి

ప్రస్తుతం చాలా మంది ఉద్యోగులను వేదిస్తున్న సమస్య పని ఒత్తిడి.. విపరీతమైన ప్రెజర్ తట్టుకోలేక చాలా మంది జాబ్స్ వదిలేస్తున్నారు. కొంతమంది వేరే కంపెనీలకు మారిపోతున్నారు. ముఖ్యంగా సాఫ్ట్ వేర్ కంపెనీల్లో పనిచేసేవాళ్లకు పని ఒత్తిడి సమస్య తీవ్రంగా వేదిస్తోంది. చాలామంది రోజులో ఎక్కువ సమయం ఆఫీసులోనే గడిపేస్తున్నారు. ఇటీవల సీఏ చేస్తున్న ఓ ఉద్యోగి పని ఒత్తిడి భరించలేక ఆత్మహత్య చేసుకున్నదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. లక్షల్లో జీతం వచ్చినా.. కంపెనీ నుంచి వచ్చే ప్రెజర్‌ని తట్టుకోవడం ఆమెను పూర్తిగా క్షీణించేలా చేసింది.



ప్రపంచవ్యాప్తంగా 12 బిలియన్ల మందికి ఇబ్బందులు ప్రపంచవ్యాప్తంగా పని ఒత్తిడితో మరణించేవారి సంఖ్య ఆందోళనని కలిగిస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం పని ఒత్తిడి వల్ల కలిగే డిప్రెషన్, ఆందోళనతో సంవత్సరానికి 12 బిలియన్ల మంది ఇబ్బందులు పడుతున్నారట. ప్రతి నలుగురు ఉద్యోగులలో ఒకరు ఈ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారట. ఇండియాలో అయితే సరైన కార్మిక రక్షణ చట్టాలు లేకపోవడం వల్ల ఉద్యోగులకు ఈ పని భారం మరింత ఎక్కువ అవుతుందని అధ్యయనాలు చెప్తున్నాయి.

పని ఒత్తిడి ఎప్పుడు ఎక్కువ అవుతుందంటే..

పనిభారం ఎక్కువ కావడం, లేదా ఇచ్చిన పనిని పూర్తి చేయలేకపోవడం, లే ఆఫ్ ప్రెజర్స్, ఇంక్రిమెంట్స్ ఇబ్బందులు. ఇవన్నీ ఉద్యోగికి ప్రెజర్‌ని ఇచ్చేకారకాలే. ఒక్కోసారి ఇవన్నీ ఒకేసారి ఎదురుకావొచ్చు. ఈ టార్గెట్స్ కంప్లీట్ అయితేనే ఇంక్రిమెంట్ ఇస్తాము. అప్రైజల్ ఇలా చేస్తూనే వస్తుంది కాబట్టి ఈ వర్క్ చేయాలంటూ.. టార్గెట్స్ పల్ల కూడా ప్రెజర్ ఎక్కువ అవుతోందని చెప్తున్నారు. ఇవే కాకుండా వీకెండ్ వర్క్స్, మంథ్ ఎండ్ టార్గెట్స్ కూడా ఉద్యోగులపై ఒత్తిడిని పెంచుతున్నాయి.

మనశ్శాంతి కోసం ఎటైనా పోవాలన్నా.. లీవ్ ఇవ్వడానికి కంపెనీలు ఇబ్బందులు ఇబ్బందులు పెడుతున్నాయి. కొందరు పగలు, రాత్రి తేడా లేకుండా పనిలోనే నిమగ్నమవుతున్నారు.

ఈ కారణాలవల్లే చాలామంది ఫ్యామిలీ లైఫ్‌కి దూరమవుతున్నారు. పర్సనల్ లైఫ్‌ని అనే సంగతిని కూడా మరచిపోతున్నారు. వీటివల్ల మానసికంగా, శారీరకంగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. నిద్ర లేమి, గుండె సమస్యలు, షుగర్, బీపీ వంటి దీర్ఘకాలిక సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. ఒత్తిడి, యాంగ్జైటీ వంటి మానసిక సమస్యలు ఎక్కువ అవుతున్నాయి.

ఎలా బ్యాలెన్స్ చేయాలంటే..

ఒత్తిడి లేకుండా పని జీవితాన్ని ముందుకు సాగించాలంటే కొన్ని బౌండరీలు సెట్ చేసుకోవాలి. స్వీయ సంరక్షణకు ప్రాధాన్యతనిచ్చుకోవాలి. పై అధికారి మెప్పు గురించి ఆలోచిస్తూ.. పనికి మించిన భారం తీసుకోకూడదు. మీ స్థోమత లేదా పరిధిని దాటే ఏ వర్క్ కైనా నో చెప్పడం నేర్చుకోండి. మొహమాటంతో సరే చేస్తేస్తాను అనేది మీకు తలకు మించిన భారం కావొచ్చు. కొలిగ్స్ వర్క్‌ని కూడా మీద వేసుకోవడం మానేయండి. మీకు అప్పగించిన పనిని.. టైమ్ లిమిట్ పెట్టుకుని దానిలోనే కంప్లీట్ అయ్యేలా చూసుకోండి.

ఫ్రెండ్స్ సాయం తీసుకోండి..!

వర్క్ ప్రెజర్ వల్ల ఒత్తిడి పెరుగుతుంటే మీ ఫ్రెండ్స్, కొలిగ్స్, ఫ్యామిలీ సహాయం తీసుకోండి. వారికి మీ ఇబ్బందిని వివరించండి. ఈ ఒత్తిడి, యాంగ్జైటీ నుంచి బయటపడేందుకు ఇతరుల సహాయం తీసుకోవడంలో తప్పులేదు. పరిస్థితి మీ చేయి దాటిపోతుందని భయం వేస్తే కచ్చితంగా వైద్యులు, నిపుణుల సహాయం తీసుకోండి. పర్సనల్ స్పేస్‌లోకి వర్క్‌ని తీసుకెళ్లకండి. రెగ్యులర్‌గా వ్యాయామం, యోగా చేసేలా జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.



భువనేశ్వర్ రీఎంట్రీకి కారణం అదే!

అసలు విషయం బయటపెట్టిన శ్రేయస్..!

న్యూఢిల్లీ, అక్టోబర్ 21 : టీమిండియా సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ సుదీర్ఘ విరామం తర్వాత భారత టీ20 జట్టులోకి అడుగుపెట్టాడు. సరిగ్గా నాలుగేళ్ల తర్వాత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చిన భువీ, న్యూజిలాండ్‌తో జరగనున్న 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం ఎంపికయ్యాడు. అంతకుముందు బెంగళూరు వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన చివరి టీ20లో అవకాశం లభించినప్పటికీ వర్షం కారణంగా మ్యాచ్ రద్దు కావడంతో బౌలింగ్ చేసే అవకాశం రాలేదు. దీంతో కివీస్‌తో జరిగే తొలి టీ20తోనే అతడి అసలైన రీఎంట్రీ ఉండనుంది. భువనేశ్వర్‌ను తిరిగి జట్టులోకి ఎంపిక చేయడానికి గల అసలు కారణాలను టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తాజాగా మీడియాతో పంచుకున్నాడు. గత కొంతకాలంగా భారత బౌలింగ్ విభాగంలో అనుభవజ్ఞులైన ఆటగాళ్ల కొరత వేధించిందని, భువీ రాకతో ఆ లోటు పూర్తిగా భర్తీ అవుతుందని అయ్యర్ స్పష్టం చేశాడు. "మా జట్టులో చాలా మంది యువ పేసర్లు ఉన్నారు. అయితే పవర్‌ప్లేలో, డెత్ ఓవర్లలో ప్రత్యర్థిపై ఎలా ఆధిపత్యం చెలాయించాలనే అనుభవం భువనేశ్వర్‌కు మెండుగా ఉంది. గత రెండు ఐపీఎల్ సీజన్లలో అతను అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. అందుకే పేస్ విభాగానికి అనుభవం అవసరమనే ఉద్దేశంతోనే అతన్ని ఎంపిక చేశాం" అని శ్రేయస్ అయ్యర్ కొనియాడారు. 36 ఏళ్ల భువనేశ్వర్ కుమార్ గతంలో ఫామ్ కోల్పోవడంతో పాటు యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించే క్రమంలో జట్టుకు దూరమయ్యాడు. అయితే దేశవాళీ క్రికెట్, ఐపీఎల్‌లో తన నిలకడైన ప్రదర్శనను కొనసాగించి మళ్లీ సెలక్టర్ల నమ్మకాన్ని చూరగొన్నాడు. ప్రస్తుత న్యూజిలాండ్ పర్యటనకు ఎంపిక చేసిన జట్టులో నలుగురు స్పెషలిస్ట్ పేసర్లు, ఇద్దరు పేస్ ఆల్‌రౌండర్లు ఉన్నప్పటికీ.. కొత్త బంతితో స్వింగ్ రాబట్టడంలో సిద్ధహస్తుడైన భువీ ప్రదర్శనపైనే అందరి దృష్టి నిలిచింది. ఈ సిరీస్‌లో భువనేశ్వర్ రాణించడం ద్వారా తన అంతర్జాతీయ కెరీర్‌ను మరింత ముందుకు తీసుకువెళ్లే అవకాశం ఉంది.

భారత్ ఖాతాలో 54 పతకాలు!

పారా ఆసియా క్రీడల్లో పతకాల పంట..

- 14 స్వర్ణాలు, 20 రజతాలు, 20 కాంస్యాలతో భారత అథ్లెట్ల జోరు
- 100, 200 మీటర్ల పరుగులో రెండు స్వర్ణాలు సాధించిన సిమ్రాన్
- పురుషుల 100 మీటర్ల టీ47 విభాగంలో దిలీప్‌కు పసిడి
- 400 మీటర్ల పరుగులో అకీరా నందన్ బానోతుకు రజతం
- పతకాల పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతున్న భారత్





జపాన్, అక్టోబర్ 21 : పారా ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు పతకాల వేట కొనసాగిస్తున్నారు. జపాన్ వేదికగా జరుగుతున్న పోటీల్లో అద్భుత ప్రదర్శనతో స్వర్ణ, రజత, కాంస్య పతకాలను సాధిస్తూ సత్తా చాటుతున్నారు. తాజాగా భారత పారా అథ్లెట్ సిమ్రాన్ మరో స్వర్ణ పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. మహిళల టీ12 విభాగం 100 మీటర్ల పరుగులో విజేతగా నిలిచి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. మంగళవారం జరిగిన 200 మీటర్ల పరుగులోనూ స్వర్ణం సాధించిన సిమ్రాన్ వరుసగా రెండు పసిడి పతకాలు గెలుచుకుని ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మరోవైపు పురుషుల టీ47 విభాగంలో దిలీప్ స్వర్ణం సాధించగా, 400 మీటర్ల పరుగులో అకీరా నందన్ బానోతు రజత పతకాన్ని అందుకున్నాడు. దీంతో భారత పతకాల సంఖ్య 54కు చేరుకుంది.

రెండు స్వర్ణాలతో మెరిసిన సిమ్రాన్

పారా ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ సిమ్రాన్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. మహిళల టీ12 విభాగంలో 100 మీటర్ల పరుగులో ప్రత్యర్థులను వెనక్కి నెట్టి స్వర్ణ పతకాన్ని సాధించింది. అంతకుముందు మంగళవారం జరిగిన 200 మీటర్ల పరుగులోనూ పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. ఒకే క్రీడా పోటీల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించి భారత పతకాల సంఖ్యను పెంచడంలో కీలక పాత్ర పోషించింది. రెండు విభిన్న దూరాల పరుగుల్లో విజేతగా నిలిచి తన ప్రతిభను చాటుకుంది.

దిలీప్‌కు పసిడి.. భారత్‌కు మరో స్వర్ణం

పురుషుల టీ47 విభాగం 100 మీటర్ల స్ప్రింట్ పోటీలో భారత అథ్లెట్ దిలీప్ సత్తా చాటాడు. వేగవంతమైన పరుగుతో ప్రత్యర్థులను అధిగమించి స్వర్ణ పతకాన్ని సాధించాడు. కీలకమైన స్ప్రింట్ విభాగంలో దిలీప్ విజయం భారత పతకాల ఖాతాలో మరో పసిడిని చేర్చింది. పురుషుల అథ్లెటిక్స్ విభాగంలో భారత క్రీడాకారుల ప్రతిభకు ఈ విజయం మరో నిదర్శనంగా నిలిచింది.

అకీరా నందన్ బానోతుకు రజతం

పురుషుల 400 మీటర్ల టీ35/38 విభాగంలో భారత అథ్లెట్ అకీరా నందన్ బానోతు రజత పతకాన్ని సాధించాడు. నిర్దిష్ట దూరాన్ని 51.25 సెకన్లలో పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచాడు. స్వర్ణ పతకం చేజారినప్పటికీ రజతంతో భారత పతకాల సంఖ్యను మరింత పెంచాడు. భారత అథ్లెట్లు స్ప్రింట్‌తోపాటు ఇతర పరుగుల విభాగాల్లోనూ పతకాలు సాధిస్తూ తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు.

54 పతకాలతో నాలుగో స్థానంలో భారత్

తాజా ఫలితాలతో భారత పతకాల సంఖ్య 54కు చేరుకుంది. ఇందులో 14 స్వర్ణాలు, 20 రజతాలు, 20 కాంస్య పతకాలు ఉన్నాయి. ఈ ప్రదర్శనతో భారత్ పతకాల పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. వివిధ అథ్లెటిక్స్ విభాగాల్లో భారత క్రీడాకారులు సాధిస్తున్న విజయాలు పతకాల సంఖ్య పెరగడానికి దోహదపడుతున్నాయి. ముఖ్యంగా సిమ్రాన్ రెండు స్వర్ణాలు సాధించడం, దిలీప్ పసిడి గెలవడం, అకీరా నందన్ బానోతు రజతం అందుకోవడం భారత బృందానికి కీలక విజయాలుగా నిలిచాయి.

పతకాల వేటలో భారత అథ్లెట్ల సత్తా

జపాన్ వేదికగా జరుగుతున్న పారా ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు తమ పట్టుదల, ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. శారీరక సవాళ్లను అధిగమిస్తూ అంతర్జాతీయ వేదికపై దేశానికి పతకాలు అందిస్తున్నారు. ఇప్పటివరకు సాధించిన 54 పతకాలతో భారత్ పతకాల పట్టికలో తొలి నాలుగు స్థానాల్లో నిలవడం విశేషం. రానున్న పోటీల్లోనూ భారత అథ్లెట్లు ఇదే జోరు కొనసాగిస్తే పతకాల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.

18 ఏళ్ల రికార్డు బద్దలు

బౌలర్‌గా వచ్చి బ్యాటింగ్‌లో అదరగొట్టిన సైమన్ హార్మర్!

గెబార్హా, అక్టోబర్ 21 : కొన్నిసార్లు కేవలం బౌలింగ్ చేయాల్సిన వారే బ్యాట్‌తో విధ్వంసం సృష్టిస్తుంటారు. సరిగ్గా అలాంటి అద్భుతమే ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్టులో చోటుచేసుకుంది. ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా ఆఫ్ స్పిన్నర్ సైమన్ హార్మర్ బ్యాటింగ్‌తో అద్భుత ప్రదర్శన చేశాడు. ఏకంగా 18 ఏళ్ల నాటి రికార్డును బద్దలు కొట్టి అందరినీ ఆశ్చర్యపరిచాడు. గెబార్హాలోని సెయింట్ జార్జ్ పార్క్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో హార్మర్ 82 పరుగులు చేసి డేల్ స్టెయిన్ పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు. తొలి టెస్టులో విజయం సాధించిన ఆస్ట్రేలియా 1-0 ఆధిక్యంలో కొనసాగుతుండగా, రెండో టెస్టులో సఫారీలు అద్భుత పోరాటంతో మ్యాచ్‌ను రంజుగా మార్చారు. మ్యాచ్ మూడో రోజు సైమన్ హార్మర్ కేవలం 91 బంతుల్లోనే 10 ఫోర్లు, 1 సిక్సర్‌తో ఉప్పొంగిపోయి 82 పరుగులు సాధించాడు. టెస్టుల్లో ఆస్ట్రేలియాపై 9వ స్థానంలో లేదా అంతకంటే దిగువన బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా ఆటగాళ్లలో ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరుగా నిలిచింది. గతంలో 2008 మెల్‌బోర్న్ టెస్టులో డేల్ స్టెయిన్ చేసిన 76 పరుగులే అత్యధికంగా ఉండేది. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 110 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ తరుణంలో కెప్టెన్ టెంబా బవుమా, మార్కో జాన్సెన్ (85) జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 132 పరుగులు జోడించారు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన సైమన్ హార్మర్.. కెప్టెన్ బవుమాతో కలిసి ఎనిమిదో వికెట్‌కు అద్భుతమైన 183 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. దక్షిణాఫ్రికా టెస్టు చరిత్రలో ఎనిమిదో వికెట్ లేదా అంతకంటే దిగువన నమోదైన అత్యుత్తమ భాగస్వామ్యాల్లో ఇది రెండోది కావడం విశేషం.

కెప్టెన్ బవుమా మారథాన్ ఇన్నింగ్స్:

మరోవైపు దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా అన్ని ఒత్తిళ్లను ఎదుర్కొంటూ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. 334 బంతుల్లో 18 ఫోర్లు, 1 సిక్సర్‌తో ఏకంగా 179 పరుగులు సాధించాడు. తొలి రోజు స్వల్ప స్కోరుకే వికెట్లు కోల్పోయిన దశలో బాధ్యతాయుత ఆటతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. సెంచరీ దిశగా సాగిన హార్మర్.. లబుషేన్ బౌలింగ్‌లో ఔట్ కాగా, అనంతరం బవుమా కూడా పెవిలియన్ చేరడంతో దక్షిణాఫ్రికా తమ తొలి ఇన్నింగ్స్‌ను 425/9 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 1 వికెట్ కోల్పోయి 3 పరుగులు చేసింది. సఫారీ పేసర్ కగిసో రబాడా నిక్ మ్యాడిన్సన్‌ను డకౌట్‌గా వెనక్కి పంపాడు. ఈ మ్యాచ్‌లో సఫారీ ఆటగాళ్ల పోరుతో టెస్టు సిరీస్ మరింత రసవత్తరంగా మారింది.



జింబాబ్వేపై భారత్ ఘన విజయం

3-0తో సిరీస్ క్లీన్ స్వీప్!

రాయ్‌పూర్, అక్టోబర్ 21: రాయ్‌పూర్ వేదికగా జింబాబ్వే మహిళలతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 92 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 216 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం 217 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లకు 124 పరుగులకే పరిమితమైంది. భారత భారీ స్కోరు చేయడంలో సీనియర్ ప్లేయర్ హర్మన్‌ప్రీత్ కౌర్, విధ్వంసకర ఓపెనర్ షఫాలీ వర్మ కీలక పాత్ర పోషించారు. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన హర్మన్‌ప్రీత్ కౌర్ జింబాబ్వే బౌలర్లపై విరుచుకుపడుతూ కేవలం 41 బంతుల్లోనే 10 ఫోర్లు, 5 సిక్సర్లతో అజేయంగా 91 పరుగులు సాధించింది. మరోవైపు షఫాలీ వర్మ 37 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 69 పరుగులు చేసి రాణించింది.

స్మృతి మంధాన రికార్డు బద్దలు కొట్టిన హర్మన్‌ప్రీత్:

ఈ మ్యాచ్‌లో అజేయంగా 91 పరుగులు చేసిన హర్మన్‌ప్రీత్ కౌర్ సరికొత్త రికార్డు సృష్టించింది. భారత గడ్డపై మహిళల టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో భారత బ్యాటర్ చేసిన అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ఇంతకుముందు ఈ రికార్డు స్మృతి



మంధాన పేరిట ఉండేది. 2025 డిసెంబర్ 28న తిరువనంతపురంలో శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో మంధాన 48 బంతుల్లో 80 పరుగులు చేయగా, తాజాగా ఆ రికార్డును హర్మన్‌ప్రీత్ అధిగమించింది.

బౌలింగ్‌లో రాణించిన నందని శర్మ:

భారీ లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన జింబాబ్వేకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. కెలిస్ న్‌ధ్లోవు ఖాతా తెరవకుండానే తొలి బంతికే ఔటైంది. షార్నే మేయర్స్ (60) పోరాడినప్పటికీ, భారత బౌలర్ల విజృంభణ ముందు నిలవలేకపోయారు. భారత బౌలర్లలో నందని శర్మ 4 ఓవర్లలో కేవలం 18 పరుగులు మాత్రమే ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టింది. దీప్తి శర్మ, క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డి చెరో వికెట్ తీశారు. జింబాబ్వే తరఫున కెలిస్ న్‌ధ్లోవు టీ20ల్లో అత్యధిక డకౌట్ల (9) రికార్డు నమోదు చేయగా, షార్నే మేయర్స్ ఒక ఇన్నింగ్స్‌లో నాలుగు సిక్సర్లు బాది రికార్డు సృష్టించింది. ఈ సిరీస్ విజయంతో భారత జట్టు నూతన జోరును ప్రదర్శించింది.

ప్రపంచకప్ వేటకు యువ భారత్ సిద్ధం.. తొలి పోరు వెస్టిండీస్‌తో!

మహిళల అండర్-19 టీ20 ప్రపంచకప్ 2027 షెడ్యూల్ విడుదల

ఖైట్మండు/ఢాకా, అక్టోబర్ 21 : మహిళా క్రికెట్‌లో యువ ప్రతిభను వెలికితీసే ఐసీసీ అండర్-19 మహిళల టీ20 ప్రపంచకప్ 2027 షెడ్యూల్, గ్రూపుల వివరాలను అంతర్జాతీయ క్రికెట్ మండలి అధికారికంగా విడుదల చేసింది. ఈసారిన ఈ మెగా టోర్నీకి బంగ్లాదేశ్, నేపాల్ సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. జనవరి 21 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీలో మొత్తం 16 జట్లు టైటిల్ కోసం తలపడనున్నాయి. ఈ టోర్నీలో పాల్గొంటున్న 16 జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు.

గ్రూప్ ఏ: భారత్, ఐర్లాండ్, వెస్టిండీస్, నేపాల్

గ్రూప్ బీ: దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, పాకిస్థాన్, సమోవా

గ్రూప్ సీ: ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, నైజీరియా, యూఏఈ

గ్రూప్ డీ: ఇంగ్లండ్, శ్రీలంక, అమెరికా, స్కాట్లాండ్

డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత జట్టు గ్రూప్-ఏలో చోటు దక్కించుకుంది. ఆతిథ్య నేపాల్ జట్టు కూడా ఇదే గ్రూప్‌లో ఉండటం విశేషం. భారత్ తొలి మ్యాచ్ ఎవరితోనంటే? డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగుతున్న భారత అండర్-19 మహిళల జట్టు తన తొలి మ్యాచ్‌లో జనవరి 22న వెస్టిండీస్‌తో తలపడనుంది.



ఇక జనవరి 21న జరిగే తొలి మ్యాచ్‌లో ఆతిథ్య బంగ్లాదేశ్, యూఏఈ జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. టోర్నీ ఫార్మాట్ ఉ వేదికలు:బంగ్లాదేశ్ (చట్టోగ్రామ్, సిల్హెట్), నేపాల్ (ఖాట్మండు) దేశాల్లోని నాలుగు ప్రధాన స్టేడియాలలో ఈ టోర్నీ మ్యాచ్‌లు జరగనున్నాయి. జనవరి 26 వరకు గ్రూప్ దశ మ్యాచ్‌లు ముగుస్తాయి. ఆ తర్వాత సూపర్ సిక్స్ దశ, ఫిబ్రవరి 4న సెమీఫైనల్స్ నిర్వహించనున్నారు. టోర్నీలో అసలు సిసలైన ఫైనల్ మ్యాచ్ ఫిబ్రవరి 6న జరగనుండగా, వర్షం లాంటి అవాంతరాలు ఎదురైతే మ్యాచ్ నిర్వహణ కోసం ఫిబ్రవరి 7ను రిజర్వ్ డేగా కేటాయించారు.

ఆ విషయంలో ఇప్పటికీ సందేహమే!



ఆసక్తికర విషయాలు వెల్లడించిన మమితా బైజు!


ఈ ఏడాది వరుస హిట్ సినిమాలతో జోరు మీదున్నారు మలయాళ కథానాయిక మమితా బైజు. ప్రస్తుతం అగ్ర కథానాయకుల సరసన నటిస్తూ ఆఫర్లు అందుకుంటున్న ఈమె, 'బెత్లెహోం కుటుంబ యూనిట్' చిత్రం గురించి ఇటీవలే ఓ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మమితా మాట్లాడుతూ.. "సూపర్ శరణ్య సినిమా షూటింగ్ అప్పుడే ముగిసింది. ఇంకా ఆ సినిమా విడుదల కూడా కాకముందే దర్శకుడు గిరీశ్ నాకు బెత్లెహోమ్ కుటుంబ యూనిట్ కథ చెప్పారు. ఆ సినిమాలో ఉన్న ప్రత్యేక పాత్రను నేను చేస్తేనే బాగుంటుందని ఆయన అన్నారు. అయితే ఆయన నాతో ఎందుకలా అన్నారో, నన్ను నమ్మడానికి ఆయనకు అంత ధైర్యం ఎలా వచ్చిందో నాకు ఇప్పటికీ తెలియదు. ఈ విషయంలో నాకు ఇప్పటికీ పెద్ద సందేహంగానే ఉంది" అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అంతేకాకుండా.. "ప్రధాన కథానాయిక పాత్రను నేను పూర్తి స్థాయిలో చేయగలనని నేను కూడా నమ్మని సమయంలో దర్శకుడు గిరీశ్ నాపై ఎంతగానో నమ్మకం ఉంచారు. 'ప్రేమలు', 'బెత్లెహోమ్ కుటుంబ యూనిట్' చిత్రాల్లో నాకు మంచి అవకాశాలు ఇచ్చినందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు" అని మమితా బైజు కృతజ్ఞతలు చెప్పుకొచ్చారు.



ఏంటి మౌళి.. పబ్లిక్‌గా టిఫిన్ చేసేస్తున్నావ్..!

'దొంగ నా కొడుకు' టీజర్ విడుదల!

యూట్యూబర్‌గా విశేష ప్రజాదరణ పొంది, 'లిటిల్ హార్ట్స్' చిత్రంతో కథానాయకుడిగా మారి భారీ విజయాన్ని అందుకున్న యువ నటుడు మౌళి ప్రధాన పాత్రలో తెరకెక్కిన తాజా చిత్రం 'దొంగ నా కొడుకు'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి శ్రీను కంబాల దర్శకత్వం వహిస్తున్నారు. కాగా, ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికరమైన టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. పూర్తిస్థాయి క్రైమ్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. వైజాగ్ నేపథ్యంలో సాగే ఈ కథలో మౌళి 'ఈశ్వర్' అనే యువకుడి పాత్రలో కనిపించనున్నాడు. ఏ పనీపాట లేకుండా ఖాళీగా తిరిగే ఈశ్వర్‌కు ఇంట్లో కూడా ఎలాంటి గౌరవం దక్కదు. అలాంటి ఈశ్వర్ జీవితంలోకి ఒక గర్ల్‌ఫ్రెండ్ రావడంతో కథ ఆసక్తికర మలుపు తిరుగుతుంది. ఊహించని విధంగా అతడి చేతికి భారీగా డబ్బు రావడం, ఆ తర్వాత ఎదురైన విచిత్ర పరిస్థితులు, సమస్యల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని టీజర్ ద్వారా స్పష్టమవుతోంది. ఈ టీజర్‌లో మౌళి తనదైన బాడీ లాంగ్వేజ్, ఫన్నీ మేనరిజమ్స్, టైమింగ్ కామెడీతో నవ్వులు పూయించాడు. 'దొంగ నా కొడుకు' అనే టైటిల్‌కు పూర్తి న్యాయం చేస్తూ క్రైమ్, కామెడీ అంశాలను దర్శకుడు శ్రీను కంబాల చక్కగా మేళవించినట్లు కనిపిస్తోంది. ఈ చిత్రంలో మౌళికి జోడీగా సుస్మితా శెట్టి నటిస్తుండగా, సీనియర్ నటులు అలీ, రఘుబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎంతో ఉత్సాహాన్ని నింపిన ఈ 'దొంగ నా కొడుకు' చిత్రం వచ్చే నెల 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



రెండో ఇన్నింగ్స్‌లో వైపు

రూటు మార్చిన 'కాజల్ అగర్వాల్..



టాలీవుడ్‌లో ఒకప్పుడు స్టార్ హీరోల సరసన వరుస బ్లాక్‌బస్టర్లతో అగ్ర కథానాయికగా చక్రం తిప్పిన 'చందమామ' కాజల్ అగర్వాల్, తన కెరీర్ రెండో ఇన్నింగ్స్‌లో సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. వివాహం, మాతృత్వం తర్వాత వెండితెరకు కొంతకాలం విరామం ఇచ్చిన ఈ సౌత్ బ్యూటీ, రీఎంట్రీలో మాత్రం కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా కథానాయికగా తనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో కమర్షియల్ ఎంటర్‌టైనర్లతో అలరించిన కాజల్, సెకండ్ ఇన్నింగ్స్‌లో కంటెంట్ ఆధారిత సినిమాలకు, లేడీ ఓరియెంటెడ్ ప్రాజెక్టులకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. 'సత్యభామ' వంటి యాక్షన్ థ్రిల్లర్ చిత్రాల్లో పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రను పోషించి నటనకు ప్రాధాన్యం ఉన్న రోల్స్ చేయగలనని నిరూపించుకున్నారు. రెగ్యులర్ హీరోయిన్ పాత్రల కంటే నటిగా గుర్తింపు తెచ్చే వైవిధ్యమైన కథలనే ఎంచుకుంటూ పయనిస్తున్నారు. కేవలం ఒక్క భాషకే పరిమితం కాకుండా పాన్-ఇండియా స్థాయిలో కూడా కాజల్ తన ముద్ర వేసేందుకు సిద్ధమవుతున్నారు. మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప'తో పాటు నితేష్ తివారీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న 'రామాయణం' చిత్రంలో మండోదరిగా కీలక పాత్ర పోషిస్తూ నేషనల్ వైడ్‌గా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, బాలీవుడ్ ప్రాజెక్టులపై కూడా దృష్టి సారిస్తూ తన సెకండ్ ఇన్నింగ్స్‌ను ఎంతో ప్లాన్డ్‌గా కొనసాగిస్తున్నారు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com